
VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com




# విశాఖ సమాచారమ్

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి : 38 సంచిక : 136 విశాఖపట్నం, 04 మార్చి 2026 బుధవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

# అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు: డిప్యూటీ సీఎం పవన్



**మంగళగిరి, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ఏపీ ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టును చేపట్టింది. మంగళగిరిలో ఈ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా పవన్ మాట్లాడారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగని తెలిపారు. వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు.

**సీఎం చంద్రబాబును కలిసిన పవన్**

సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. 'హనుమాన్' కార్యక్రమం ముగియగానే నేరుగా సీఎం ఇంటికి ఆయన వెళ్లారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి నియోజకవర్గాల వారీగా జరిగిన కేటాయింపులు తదితర అంశాలపై చర్చ జరిగింది. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'హనుమాన్' ప్రాజెక్ట్ వివరాలను సీఎంకు పవన్ వివరించారు.

# రాజ్యసభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎంపిక

**ఢిల్లీ :** ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన నితిన్ నబీన్‌ను రాజ్యసభకు పంపనుంది పార్టీ అధిష్టానం. ఈ మేరకు 9 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది బీజేపీ అధిష్టానం. బిహార్ నుంచి నితీన్ నబీన్‌తో పాటు శివేష్ కుమార్‌లను రాజ్యసభకు ఎంపిక చేసింది. వీరిద్దరితో పాటు మిగతా వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- అస్సాం నుంచి తేరాష్ గోవాలా, జోగెన్ మోహన్
- ఛత్తీసగఢ్ నుంచి లక్ష్మి వర్మ
- హర్యానా సంజయ్ భాటియా
- ఒడిశా నుంచి నుంచిమన్మోహన్ సామల్, సుజిత్ కుమార్
- పశ్చిమ బెంగాల్ నుంచి రాహుల్ సిన్హా

**సొంత రాష్ట్రమైన బిహార్ నుంచి నితిన్ నబీన్..**

ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నితిన్ నబీన్ ఇన్నాళ్లు బిహార్‌లో రోడ్డు రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన్ను కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ప్రకటించిన వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేసినప్పటికీ బంకీపూర్ స్థానం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన ముందున్న 5 రాష్ట్రాల ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే అత్యంత కీలకమైన

⏭ తరువాయి 2లో..






# విశాఖకు మళ్లీ ఐబీఎం

**సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియాలో రిజిస్ట్రేషన్**

**మూడేళ్లలో 502 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రకటన**

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** దిగ్గజ ఐటీ కంపెనీ ఐబీఎం మళ్లీ విశాఖకు వస్తోంది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)లో తాజాగా రిజిస్ట్రేషన్ చేసుకుంది. ఈ నేపథ్యంలో 'వెల్కం ఐబీఎం' అంటూ ఎక్స్ వేదికగా ఎస్‌టీపీఐ పోస్టు చేసింది. విశాఖ కేంద్రంగా మూడేళ్లలో ఐబీఎం రూ.321 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతులు చేయనున్నట్లు అందులో ప్రకటించారు. ఐబీఎం ద్వారా స్థానికంగా 502 మందికి ఉపాధి కలగనుంది. విశాఖలో ఇప్పటికే అనువైన స్థలం సేకరించి, కార్యాలయ భవనం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**వైకాపా హయాంలో విశాఖను వీడి..**

వైకాపా ప్రభుత్వంలో విశాఖను వీడిన దిగ్గజ ఐటీ సంస్థల్లో ఐబీఎం ఒకటి. గతంలో రుషికొండ హిల్-3పై కెనెక్సా కంపెనీకి 25 ఎకరాలు కేటాయించగా, అది ఐబీఎం తీసుకుంది. అయితే ఎక్కువ మందికి ఉపాధి చూపాలన్న నిబంధనతో తమకు 3.20 ఎకరాలు మాత్రమే అవసరమని చెప్పి మిగిలిన 21.80 ఎకరాలను ఏపీఐఐసీకి ఇచ్చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఐబీఎం భవనాన్ని ఇన్ఫినిటీ సంస్థకు అమ్మేసి విశాఖను వదిలి వెళ్లిపోయింది. ఆ సంస్థ వెనక్కి ఇచ్చిన 21.80 ఎకరాలనే ఇప్పుడు కూటమి ప్రభుత్వం టీసీఎస్‌కు కేటాయించింది.

**ఇన్ఫోసిస్‌కు భూ కేటాయింపులు కొలిక్కి..**

విశాఖ ఐటీ హిల్స్‌లో ప్రైవేటు భవనంలో కార్యకలాపాలు

⏭ తరువాయి 2లో..



# వైకాపా హయాంలో తరిమేసిన కంపెనీలు తిరిగొస్తున్నాయి

**మంత్రి డీఎస్‌బీవీ స్వామి**

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** వైకాపా హయాంలో రాష్ట్రం నుంచి తరిమేసిన కంపెనీలన్నీ నేడు సీఎం చంద్రబాబుపై నమ్మకంతో మళ్లీ తిరిగొస్తున్నాయని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రముఖ ఐటీ కంపెనీ ఐబీఎం.. విశాఖలో మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు రావడం శుభపరిణామమని చెప్పారు.

రానున్న మూడేళ్లలో ఆ సంస్థ రూ.322 కోట్ల విలువైన ఐటీ ఉత్పత్తులను ఎగుమతి చేయనుందని మంత్రి అన్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. నాడు కమీషన్ల కక్కుర్తితో జగన్ అండ్ కో రాష్ట్రంలోని పరిశ్రమలను తరిమేసి యువతను రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దేశ విదేశాలు తిరిగి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని

# పోలవరం పనుల్లో నాణ్యత ధ్రువీకరించి ముందుకు వెళ్లండి

**ప్రాజెక్టులోని అనుమానాలకు సమాధానాలు చెప్పండి**

**సెంటర్ ఫర్ లిబర్టీ ఛైర్మన్ ఏబీ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు నల్లమోతు చక్రవర్తి**



**విజయవాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏబీ వెంకటేశ్వరరావు, చక్రవర్తి**

**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రం వాల్, గ్యాప్ 1 ప్రధాన డ్యాంలో పనుల తీరుపై అనుమానాలు నివృత్తి చేయాలి. ఈ ప్రాజెక్టు పనులు నాణ్యంగా జరుగుతున్నాయని స్పష్టం చేసి ఆ తర్వాత కొనసాగించాలి. కేంద్ర జలసంఘం, విదేశీ నిపుణుల బృందం ప్రస్తావించిన అంశాలకు సమాధానాలు చెప్పాలి' అని సెంటర్ ఫర్ లిబర్టీ ఛైర్మన్ ఏబీ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు నల్లమోతు చక్రవర్తి డిమాండ్ చేశారు. 'గైడ్‌బండ్‌ను మూడేళ్లుగా ఎందుకు పట్టించుకోలేదు అప్రోచ్ ఛానల్‌లో తవ్వాల్సిన మట్టి 38.5 లక్షల క్యూబిక్ మీటర్ల నుంచి 5 లక్షల క్యూబిక్ మీటర్లకు ఎలా తగ్గిపోయింది' అని ప్రశ్నించారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరిద్దరూ మాట్లాడారు. వారు ప్రస్తావించిన అంశాలు ఇవీ..

డయాఫ్రం వాల్ భూమి పైకి కనిపిస్తున్న భాగంలో జాయింట్లు సరిగా లేవు. నాణ్యత సరిగా కనిపించడం లేదు. విదేశీ నిపుణుల బృందం కూడా ఈ అంశాలు ప్రస్తావించింది. పైకి డి వాల్ ఇలా ఉంటే నదీ గర్భంలో నిర్మించింది ఎలా ఉందన్న అనుమానాలు ఉన్నాయి. అల్ట్రాసోనిక్ సౌండ్ పరీక్షలు చేయాలని విదేశీ నిపుణులు చెప్పారు. ఆ పరీక్షలు చేశారా ఏ ఫలితాలు వచ్చాయి బావర్ కంపెనీ డి వాల్ సమయంలో బ్లీడింగు వస్తోందని పేర్కొంది. ఆయా నాణ్యత నియంత్రణ ఫలితాలు ప్రజల ముందుంచాలి.

గ్యాప్ 1 ప్రధాన డ్యాంను కేంద్ర జలసంఘం ఆకృతి ప్రకారం నిర్మించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎందుకు నిర్మించారు? ఒక మీటరు ఎందుకు కుదించారు. డయాఫ్రం వాల్ 1,400 మీటర్ల పొడవునా నిర్మించారు. భూగర్భంలో రాయి తగిలిన చోట నుంచి నిర్మించుకుంటూ రావాలి. భూమిపైన ఎంత అవసరమో అంతకు మించి నిర్మిస్తారు. ఆనక పైన ఉన్న అనవసరపు భాగాన్ని తొలగిస్తారు. ఇలా తొలగించే క్రమంలో +19 మీటర్ల వరకు డి వాల్ ఉంచి ఆ పైన కోత విధించాల్సి ఉంది. 400 మీటర్ల పొడవునా +18.5 మీటర్ల వరకు ఎందుకు కోత పెట్టారు. నిర్దేశించిన దాని కన్నా అరమీటరు మేర ఎందుకు తొలగించారు.

రాష్ట్రంలో జలవనరులశాఖ చెప్పినట్లు మేఘా కంపెనీ (పోలవరం గుత్తేదారు) వింటోందా ఆ కంపెనీ చెప్పినట్లు జలవనరులశాఖ వింటోందా గుత్తేదారు నియంత్రణలో లేని విధంగా స్వతంత్ర సంస్థను మానిటరింగ్ కన్సల్టెన్సీగా

⏭ తరువాయి 2లో..


# విద్యార్థులకు టర్కీ తువ్వాళ్లు



**పార్వతీపురం పట్టణం, విశాఖ సమచారామ్, మార్చి 3 :** రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. స్టేషనరీ, దుప్పట్లు, జంబుఖానాలు, నీటి సీసాలు అందజేసి ఇబ్బందులు తీర్చింది. తాజాగా సున్నితమైన, నాణ్యమైన టర్కీ తువ్వాళ్లు పంపిణీ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల్లో ఉంటున్న 762 మంది విద్యార్థులకు వీటిని అందజేసినట్లు జిల్లా సంక్షేమ, సాధికారత అధికారి ఎం.శ్యామల తెలిపారు. ఒక్కొక్కటి రూ.404 విలువ ఉంటుందని వివరించారు.

# ఇండోనేషియాలో భూకంపం

**జకార్తా :** ఇండోనేషియాలో భూకంపం సంభవించింది. ఇండోనేషియాలోని అసే ప్రావిన్స్‌లో మంగళవారం 6.4తీవ్రతతో భూమి



⏭ తరువాయి 2లో..

# శ్రీవారి అన్న ప్రసాదానికి.. 'హైటెక్' హంగులు

**సీఎం చంద్రబాబు సూచనలతో పూర్తిగా ఆటోమేషన్ విధానం**

**రూ.120 కోట్ల భారీ విరాళంతో నిర్మించనున్న రిలయన్స్**

**అత్యాధునిక వంటశాల, డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టనున్న స్థలం ఇదే**



**డిజిటల్, తిరుపతి:** వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమల విచ్చేసే లక్షల మంది భక్తుల ఆకలితీర్చే 'అన్న ప్రసాదం' పంపిణీ హైటెక్ హంగులను అద్దుకోనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా, పూర్తిగా ఆటోమేషన్ విధానంలో అత్యాధునిక వంటశాల, డైనింగ్ బ్లాక్‌ను నిర్మించేందుకు మార్గం సుగమమైంది. ప్రముఖ పారిశ్రామిక సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్.. రూ.120 కోట్ల విరాళంతో ప్రాజెక్టును చేపట్టనుంది. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి రిలయన్స్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయూకు) కుదుర్చుకునేందుకు ఇటీవల జరిగిన సమావేశంలో తితిదే పాలకమండలి ఆమోదం తెలిపింది.

**అల్లమ్మ తోటలో...**

ఇటీవల తిరుమలవచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు..వంటశాల నిర్వహణలో ఆటోమేషన్

⏭ తరువాయి 2లో..

# లైసెన్స్ గడువు ముగుస్తుందని భారీగా బాణసంచా తయారీ

**వేట్లపాలెం ఘటనలో యజమాని నిర్లక్ష్యం సుస్పష్టం**



**కాకినాడ, సామర్లకోట గ్రామీణం:** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో శనివారం భారీ పేలుడుకు కారణమైన సూర్యశ్రీ ఫైర్ వర్క్స్‌కు బాణసంచా అమ్మకాల లైసెన్స్ ఈ నెలాఖరుతోనే ముగియనుంది. లైసెన్స్ పునరుద్ధరణకు నెల ముందే దరఖాస్తు చేసుకోవాలి. అయినా పట్టించుకోకుండా, ఆ కేంద్రం యజమాని అడబాల అర్జున్ ఆర్డర్లు వస్తున్నాయని భారీ ఎత్తున బాణసంచా తయారీపై దృష్టిపెట్టాడు. అధికారులతో పరిచయాలున్నందున నెలాఖరున వెళ్లినా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవచ్చనేది అతని ధీమా. ఒకవేళ అనుమతి రావడంలో జాప్యం జరిగితే.. తన సోదరుడి పేరిట ఉన్న మరో దుకాణంలో వాటిని నిల్వ చేసుకోవచ్చని ముందే ప్రణాళికతో ఉన్నాడు. ఇంతలోనే దారుణం జరిగిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువమందిని పనిలో పెట్టుకోవడం, అనుమతికి మించి భారీగా ముడి పదార్థాలను నిల్వచేయడంతో భారీ పేలుడులో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఒకరి నిర్లక్ష్యానికి ఇంతమంది బలైపోయారు.

**మృతురాలి తల అప్పగింత**

సామర్లకోట/గ్రామీణం, పెద్దాపురం, కాకినాడ (మసీదుసెంటర్), న్యూస్‌టుడే: బాణసంచా తయారీ

⏭ తరువాయి 2లో..

# విద్యావేత్త జనార్దన్ వాఘ్మరే కన్నుమూత

**లాతూర్:** ప్రముఖ విద్యావేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ జనార్దన్ వాఘ్మరే(91) మహారాష్ట్రలోని లాతూర్‌లో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో జనవరి 24న ఆసుపత్రిలో చేరిన ఆయన తన నివాసంలో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌కు జనార్దన్ అత్యంత సన్నిహితుడు. విద్య, సాహిత్యం, ప్రజాసేవ రంగాల్లో చేసిన కృషితో గుర్తింపు పొందారు. నాందేడ్‌లోని స్వామి రామానంద్ తీర్థ్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి దానికి ఉప కులపతిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించారు.

# గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులతో మంత్రి వీడియో కాల్

**అమరావతి, విశాఖ సమాచరామ్, మార్చి :** గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులతో ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఏపీఎన్ఆర్టీసీ హెల్ప్‌లైన్ ద్వారా పూర్తి సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ వెంటే ఉంటుందని కార్మికులకు ధైర్యం చెప్పారు. హెల్ప్‌లైన్ నంబర్ 8500027678కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని వారికి సూచించారు.

# హోర్ముజ్ మూసివేశాక.. ఇవీ ఆప్షన్లు



**అమరావతి, విశాఖ సమాచారమ్, మార్చి 3 :** ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో గల్ఫ్ దేశాలను అంతర్జాతీయ వాణిజ్యంతో అనుసంధానించే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో పెట్రోలియం, గ్యాస్ రవాణాకు పెద్ద ఆటంకం ఏర్పడుతుందన్న ఆందోళనలు నెలకొన్నాయి. అయితే దీనికి ప్రత్యామ్నాయ మార్గాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**సౌదీ అరేబియా:** తూర్పు-పశ్చిమంగా పెద్ద పైప్‌లైన్ ఉంది. దీన్నే పెట్రోలైన్ అంటారు. ఎర్రసముద్ర తీరంలోని యంబు నౌకాశ్రయానికి ఇది వెళుతుంది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఐరోపా, అమెరికాలకు చమురు సరఫరా చేయవచ్చు.

**యూఏఈ:** అబుదాబీ నుంచి ఒమన్ లోని ఫుజైరా వరకు పైప్‌లైన్ ఉంది. దీంతో ఒమన్ వరకు పైప్‌లో సరఫరాచేసి అక్కడ నుంచి నౌకాశ్రయాల ద్వారా చమురును ఆసియాలోని ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశముంది.

**ఇరాక్:** కిర్కిక్ నుంచి తుర్కియేలోని సీహన్ వరకు పెద్ద పైప్‌లైన్ ఉంది. కొన్ని చోట్ల మరమ్మతులు నిర్వహిస్తే తుర్కియేకు పెట్రోలియం అందుతుంది. అక్కడ నుంచి పశ్చిమదేశాలకు సరఫరా చేసే సౌలభ్యం ఉంది.

ఇవే కాకుండా అమెరికా ఇతర దేశాల రక్షణతో చమురు ట్యాంకర్లు హోర్ముజ్ గుండా ప్రయాణించవచ్చు. ఇక ఈ మార్గం ద్వారానే చైనాకు అధికంగా చమురు సరఫరా జరుగుతుంటుంది. బీజింగ్‌కు టెహ్రాన్ మిత్రపక్షం. దీంతో ఈ జలసంధిని ఎక్కువ కాలం మూసివేయదన్న విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

# యూట్యూబ్‌లో మోదీ హవా 3 కోట్లు దాటిన సబ్‌స్క్రైబర్లు




**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీకి దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ చాలామంది అభిమానులు ఉన్నారు. బయటే కాకుండా సామాజిక మాధ్యమాల్లో కూడా ఆయన హవా కొనసాగుతోంది. తాజాగా ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్‌లో మోదీ ఛానల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 30 మిలియన్లు (3 కోట్లు) దాటింది. దీంతో ఈ వేదికపై ప్రపంచంలోనే అత్యధిక సబ్‌స్క్రైబర్లు ఉన్న రాజకీయ నేతగా మోదీ రికార్డు సృష్టించారు. రెండో స్థానంలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో ఉన్నారు. 2007లో ప్రధాని మోదీ యూట్యూబ్ ఛానల్ ప్రారంభించారు. ఇప్పటివరకు ఆయన 33వేలకు పైగా వీడియోలను షేర్ చేశారు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే ప్రధాని మోదీకి ఉన్న సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య ఏడు రెట్లు ఎక్కువ. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లోనూ మోదీ ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లు దాటిన విషయం తెలిసిందే.

# ఒక్క రోజే రూ.7వేల కోట్లు

## ఇరాన్‌తో యుద్ధానికి అమెరికా లెక్క ఇది



**అమెరికా :** అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత?

**ఒక్క రోజే రూ.7వేల కోట్ల వ్యయం..**

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. కానీ, 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను (భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు) ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి.

ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే) వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.59 కోట్లు) చొప్పున ఖర్చవుతుందట.

**ఆయుధాలనూ కోల్పోతూ..**

ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్ (పొరపాటుగా జరిపిన కాల్పుల్లో)లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక స్థిరత్వం, సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. "ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బడ్జెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే. ఉద్రిక్తతలు నిరవధికంగా కొనసాగితే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు పనిచేయడం కష్టం. ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే" అని అమెరికా మేధో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు క్రిస్టోఫర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఆర్థికభారం భారీగానే..**

కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.1 లక్షల కోట్ల)కు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# మరో యుద్ధానికి భారత్ సన్నాహాలు: పాక్ అధ్యక్షుడు

**పాకిస్థాన్ :** పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ దేశంతో మరో యుద్ధం చేయడానికి భారత్ సన్నాహాలు చేస్తోందన్నారు. సింధూ జలాల ఒప్పందం రద్దుపై మాట్లాడుతూ.. రాజకీయ అవసరాల కోసం భారత్ నీటిని ఆయుధంలా వాడుకుంటుందని అక్కసు వెళ్లగక్కారు. ప్రాంతీయ శాంతికి మద్దతుదారుగా తాను ఇటువంటి చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భారత అధికారులు యుద్ధం చేయాలన్న ఆలోచనల నుంచి వెనక్కి తగ్గి తమతో చర్చలకు రావాలని కోరారు.

జమ్మూకశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి, కశ్మీర్‌లోని ప్రజలకు అవసరమైన దౌత్యపరమైన సహాయాన్ని అందించడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందని జర్దారీ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో శాంతిని అస్థిరపరిచేందుకు అఫ్గాన్ ప్రయత్నాలు చేస్తోందని.. వాటిని అడ్డుకోవడానికి తమ దళాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంఘర్షణను జర్దారీ ఖండించారు.



ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ మృతికి సంతాపం తెలిపారు. యూఏఈ, బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలపై దాడులు చేయడం సరైన చర్య కాదన్నారు.

# ఎట్టకేలకు భారత్‌కు చేరుకున్న పీవీ సింధు




**బెంగుళూరు :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు (బాఉఅఅసష్ట్రబ) ఎట్టకేలకు భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. "సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నా. గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నా. ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగా. ఈ క్లిష్ట సమయంలో మమ్మల్ని సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేను. వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా. రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తా" అని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధు.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతల నేపథ్యంలో గత శనివారం నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఆమె ప్రయాణం ఆగిపోయింది. అప్పటినుంచి దుబాయ్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే యూఏఈ, భారత్ అధికారుల సమన్వయంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో సింధు బెంగళూరుకు చేరుకున్నారు.

ఇదిలాఉండగా.. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సింధు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిణామాల్ని నిశితంగా గమనిస్తోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ).. ప్రయాణ ఆటంకాల కారణంగా క్రీడాకారులు ఆలస్యంగా వస్తే షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు.

# సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ



**ఢిల్లీ:** తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్ సమావేశాల కంటే ముందే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వెల్లడించిన కిషన్‌రెడ్డి.. రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాల అమలు.. ఇలా ఏ పని చేయాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని విమర్శలు గుప్పించారు.

సాస్కి పథకం కింద తెలంగాణకు రూ.10,000 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను కేంద్రం అందించిందని కిషన్‌రెడ్డి వివరించారు. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా, ఖజానా ఖాళీ అని నెపం నెట్టడంపై కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని లేఖలో ఆయన స్పష్టీకరించారు.

"2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో ద్వారా 6 ప్రధాన గ్యారంటీలతో పాటుగా 420 హామీలను తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. ఈ హామీలను నమ్మిన తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌కి అధికారాన్ని కట్టబెట్టింది. అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మీరు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ..రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే, ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా గాంధీ-రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మీరు మాట్లాడిన తీరును చూస్తుంటే, రాష్ట్ర ఖజానా నిల్ - కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతోంది. 2014లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తూ వస్తోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మరెన్నో మూలధన పెట్టుబడులు మొదలైనవాటి రూపంలో గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36,000 కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40,000 కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50,000 కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40,000 కోట్లకు పైగా నిధులు, రూ.12,000 కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14,000 కోట్లకు పైగా పీఎం కిసాన్ నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లకు పైగా నిధులు, విద్య & క్రీడలకు రూ.21,000 కోట్లకు పైగా నిధులు, దాదాపు రూ.9,000 కోట్ల ఆరోగ్య సంరక్షణ నిధులు మొదలైనవి ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కాబట్టి, మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరపున మిమ్మల్ని కోరుతున్నాను" అంటూ కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# శ్రీవారి అన్న ప్రసాదానికి 'హైటెక్' హంగులు

(మొదటి పేజీ తరువాయి)

వైపు మళ్లాలని సూచించారు. ఈ నేపథ్యంలో అన్న ప్రసాద కాంప్లెక్స్ సమీపంలోని 'అల్లమ్మ తోట'(గ్యాస్ ప్లాంట్ ఉన్న ప్రదేశం)ను కొత్త వంటశాల నిర్మాణానికి అనువైనదిగా అధికారులు గుర్తించారు. నిర్మాణం పూర్తయ్యాక వంటశాలను తితిదేకు అప్పగించడంతో పాటు, నిర్వహణపై తితిదే సిబ్బందికి అవసరమైన నైపుణ్య శిక్షణను రిలయన్స్ ఏజెన్సీలే అందిస్తాయి.

# లైసెన్స్ గడువు ముగుస్తుందని భారీగా బాణసంచా తయారీ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలో పేలుడు ఘటన జరిగిన మూడు రోజులకు సోమవారం సమీప పొలాల్లో ప్రమాద స్థలానికి 100 మీటర్ల దూరంలో గుర్తుపట్టలేని స్థితిలో మహిళ తల కనిపించింది. ఘటన జరిగిన రోజు మృతదేహాలకు పంచనామా నిర్వహించిన పోలీసులు వేట్లపాలేనికి చెందిన సకుమళ్ల రాఘవ (50) అనే మహిళ మృతదేహాన్ని తల లేకుండానే కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇప్పుడు పొలంలో కనిపించింది రాఘవ తలేనని గుర్తించారు. దాన్నుంచి డీఎన్ఏ సేకరించిన అనంతరం ఆమె బంధువులకు అప్పగించామని డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. మరోవైపు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఏడుగురి పరిస్థితి విషమంగానే ఉంది. ఈ ప్రమాద ఘటనలో ఇప్పటివరకు 22 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

**మరో గంట గడిచి ఉంటే ప్రాణాలు దక్కేవి**

ప్రమాదం జరిగిన రోజు మరో గంట గడిచి ఉంటే వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తున్న కష్టజీవుల ప్రాణాలు పోయేవి కావని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని సింగారమ్మచింత, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలో ఆదివారం జరిగే జాతరల్లో బాణసంచా కాల్చేందుకు ఇక్కడి తయారీ కేంద్రం నిర్వాహకులకు భారీ ఆర్డర్ వచ్చింది. దీంతో సుమారు 40 మంది కార్మికులతో పని చేయిస్తున్నారు. తయారైన బాణసంచాను మధ్యాహ్నం 3 గంటలకు తరలించాల్సి ఉంది. ఈలోగా 2.10కి పేలుడు సంభవించి.. పేదల ప్రాణాలను బలి తీసుకుంది.

# పోలవరం పనుల్లో నాణ్యత ధ్రువీకరించి ముందుకు వెళ్లండి

(మొదటి పేజీ తరువాయి)

నియమించాలి. పోలవరంలో 2023లో గైడ్‌బండ్ ధ్వంసమైంది. సంబంధిత బాధ్యులపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. మూడేళ్లుగా కొత్త గైడ్‌బండ్ ఎందుకు నిర్మించలేదు. వచ్చే వరదలకు ఈ గైడ్‌బండ్ తెగి మళ్లీ కొత్త డి వాల్‌పై నీళ్లు ప్రవహిస్తే ఇబ్బందులు రావా స్పిల్ వేకు నీళ్లు తీసుకువెళ్లే అప్రోచ్ ఛానల్‌లో ఇంకా మట్టి తవ్వాల్సి ఉంది. గతంలో 38.55 లక్షల క్యూబిక్ మీటర్లు ఇంకా పెండింగులో ఉందని రికార్డులు పేర్కొంటున్నాయి. ఇప్పుడు 5 లక్షల క్యూబిక్ మీటర్లే అంటున్నారు. మట్టి పరిమాణం ఎందుకు తగ్గింది స్వతంత్ర అంతర్జాతీయ రివ్యూ ప్యానెల్‌ను నియమించాలి.

# విశాఖకు మళ్లీ ఐబీఎం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తున్న ఇన్ఫోసిస్ శాశ్వత క్యాంపస్‌కు భూమి కేటాయించాలంటూ ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. అధికారులు ఎండాడలో 20 ఎకరాలు గుర్తించారు. ఈ భూ కేటాయింపులపై చర్చలు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయి.

# ఇండోనేషియాలో భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

కంపించిందని జియోఫిజిక్స్ ఏజన్సీ తెలిపింది. భూకంప కేంద్రం 13 కి.మీ లోతులో ఉందని పేర్కొంది. సునామీ వచ్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది.

# రాజ్యసభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతూ, అసెంబ్లీకి హాజరవ్వడం అంత సులభమేమీ కాదు. అటు ఎమ్మెల్యేగా, ఇటు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ద్వంద్వ పాత్రలు పోషించడం కష్టమని అధిష్టానం భావించింది. ఈ క్రమంలోనే ఆయనను ఆయనను రాజ్యసభకు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే మాదిరిగా మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డాను రాజ్యసభకు పంపారు. వచ్చే ఏప్రిల్‌లో బిహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీనిలో భాగంగానే రాజ్యసభ సభ్యుల ఎంపికను షురూ చేసింది బీజేపీ.

# పడకేసిన ఇళ్ల నిర్మాణం



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** జిల్లాలో బలహీనవర్గాల గృహ నిర్మాణాలు ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కు. అన్న తీరున సాగుతున్నాయి. ఫలితంగా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై, అసంపూర్తిగా వున్న 43,948 ఇళ్లలో గత ఏడాది అక్టోబరు నెలాఖరులోగా 13,687 ఇళ్లను పూర్తి చేయాలని నియోజకవర్గా వారీగా లక్ష్యాలను పెట్టుకున్నారు. కానీ ఇంతవరకు 9,520 గృహ నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. గత వైసీపీ పాలకులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 608 లేఅవుట్లు వేసి, ఇళ్లు లేని వారికి సెంటు చొప్పున అందజేశారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు మంజూరయ్యాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన నిధులు చాలకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను మధ్యలో ఆపేశారు. వైసీపీ హయాంలో 62,488 గృహాలు మంజూరుకాగా, ఆ ప్రభుత్వం దిగిపోయేనాటికి 18,500 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తియ్యాయి. 43,948 గృహాలు అసంపూర్తిగా వుండిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. అంతేకాక ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున అదనంగా ఆర్థిక సాయం అందించింది. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అంతేకాక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. మొత్తం 43,948 ఇళ్లలో 13,687 ఇళ్లను 2025 అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించింది. కానీ ఎక్కడా అనుకున్న మేర పనులు జరగడంలేదు. గడువు ముగిసి నాలుగు నెలలు దాటినప్పటికీ ఇంతవరకు 9,520 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 4,167 ఇళ్ల పనులు కొంతమేర జరిగి, ఆగిపోయాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. అనకాపల్లిలో 2,754 అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంకాగా 1,635 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. చోడవరంలో 1,649 ఇళ్లనుగాను 1,209 ఇళ్లు, మాడుగులలో 2,090 ఇళ్లకు 1,638 ఇళ్లు, నర్సీపట్నంలో 2,404 ఇళ్లకుగాను 1,829 ఇళ్లు, పాయకరావుపేటలో 2,988 ఇళ్లకుగాను 2,112 ఇళ్లు, ఎలమంచిలిలో 1,212 ఇళ్లకుగాను 768, పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాల్లో 580 ఇళ్లకుగాను 329 ఇళ్లు పూర్తయ్యాయి. చాలాచోట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడం, గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదని తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి, లక్ష్యంమేరకు పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కూటమి పార్టీలకు చెందిన నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి చెక్

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** స్థానిక సంస్థలకు కేంద్రం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచింది. నిర్దేశిత రంగాలకు చెందిన పనులకు మాత్రమే ఆ నిధులు వెచ్చించాలని ఇప్పటికే స్పష్టంచేసింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు, వారి అనుయాయులకు చెందిన వ్యవసాయ క్షేత్రాలు, పశువులశాలలు, ప్రధానంగా కల్లాల్లో బోర్లు నిర్మాణానికి నిధులు మంజూరుచేసుకున్నారు. ఆ విధంగా నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. తాగునీటి అవసరాలు తీర్చడం అంటే ప్రజల నివాసాల మధ్య బోర్లు నిర్మించాలి. ఆ నిబంధనను ఉల్లంఘించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిపై ఆంక్షలు విధించింది. దీంతో జడ్పీ సాధారణ సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పలువురు సభ్యులు కల్లాల్లో బోర్లు మంజూరుచేయాలని కోరినా అధికారులు తిరస్కరించారు.కేంద్రం మంజూరుచేసిన 15వ ప్రస్తుత ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు...రూ.1311.1 లక్షలతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 358 పనులు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా విశాఖ జిల్లాలో రూ.116 లక్షలతో 17 పనులు, అనకాపల్లి జిల్లాలో రూ.272.6 లక్షలతో 63 పనులు, అల్లూరి జిల్లాలో రూ.216 లక్షలతో 54 పనులు చేపట్టారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా విశాఖ జిల్లాలో రూ.137 లక్షలతో 42, అనకాపల్లి జిల్లాలో రూ.421.4 లక్షలతో 140 పనులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.146.6 లక్షలతో 42 పనులు మంజూరుచేశారు. రెండు విభాగాల్లో ఇప్పటివరకూ 168 పనులు పూర్తిచేయగా, మరో 160 పనులు పురోగతిలో ఉన్నాయి. మరో 30 పనులు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. జిల్లా పరిషత్‌కు వచ్చే సాధారణ నిధుల నుంచి రూ.955.58 లక్షలతో 228 పనులు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పరిధిలో విశాఖ జిల్లాలో రూ.176.75 లక్షలతో 19 పనులు, అనకాపల్లి జిల్లాలో రూ.228.98 లక్షలతో 58, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.164.6 లక్షలతో 40 పనులు మంజూరుచేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో రూ.90.1 లక్షలతో 23, అనకాపల్లి జిల్లాలో 157.95 లక్షలతో 53, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.136.68 లక్షలతో 35 పనులు మంజూరుచేశారు. ఇప్పటివరకూ రెండు విభాగాల్లో కలిపి 65 పనులు పూర్తికాగా, 151 పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 12 ఇంతవరకూ ప్రారంభించలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో సామాజిక భవనాలు, పాఠశాలలు, జనావాసాల మధ్య, ఇంకా పంచాయతీల ఆధ్వర్యంలో నడుస్తున్న మంచినీటి పథకాలకు అవసరమని గుర్తించినచోట మాత్రమే బోర్లు వేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే జడ్పీ సాధారణ నిధులను పంచాయతీలు నిర్వహించే తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులు, గ్రామాలు, మండలాల మధ్య రోడ్ల అనుసంధానానికి మాత్రమే వెచ్చించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టే పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈలకు ఆదేశించామని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు.

# డిజి 'డల్' లక్ష్మి




**నర్సీపట్నం, విశాఖసమాచారం:** నర్సీపట్నం, మున్సిపాలిటీల్లో డిజిటల్ లక్ష్మి కార్యక్రమం పట్టాలెక్కలేదు. ఇప్పటివరకు ఒకరికే ఈ పథకం వర్తించింది. మిగిలిన వారంతా ప్రభుత్వం అందించే కియోస్కుల కోసం ఎదురు చూస్తున్నారు. మహిళలకు ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యుల కుటుంబాల్లో చదువుకున్న వారికి శిక్షణ ఇచ్చి వారితో మీసేవ తరహాలో ఆన్‌లైన్ సేవా కేంద్రం ఏర్పాటు చేయించాలి. జిల్లాలోని నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల్లో ఆరు నెలల కిందట శిక్షణ పూర్తయినా.. ఒకరికి మినహా మిగతా వారెవరికీ నేటికీ ప్రయోజనం చేకూరలేదు. అనకాపల్లి జీవీఎంసీ జోన్ పరిధిలోని 42 సమాఖ్యల్లో ఒక్కో మహిళను ఎంపిక చేశారు. వీరందరికీ కంప్యూటర్ పరిజ్ఞానంపై గత ఏడాది ఏప్రిల్‌లో శిక్షణ ఇచ్చారు. వీరికి ఒక్కోరికి రూ. 2 లక్షల రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నేటికీ పూర్తిస్థాయిలో వీరి సేవలు అందుబాటులోకి రాలేదు. ఎదురుచూపుల్లోనే మహిళలు లబ్ధిదారులు తమ ఇంటివద్ద చూపిన స్థలంలో కియోస్కులు ఏర్పాటు చేస్తే సేవా కేంద్రాల నిర్వహణ ద్వారా ఉపాధి పొందవచ్చని ఎదురుచూస్తున్నారు. నర్సీపట్నంలో జోగినాథునిపాలెం వద్ద లబ్ధిదారు పైలా వెంకటలక్ష్మి ఒకరికే మూడు నెలల కిందట కియోస్క్ అందజేశారు. నిర్వహణ ఖర్చులు పోను నెలకు రూ.10 వేల వరకు ఆదాయం ఉంటోందని మెప్మా సిబ్బంది చెబుతున్నారు. నర్సీపట్నం, ఎలమంచిలి పురపాలక సంఘాల్లో మరెవరికీ ఇప్పటివరకు కియోస్కులు సమకూరలేదు. ఇవి ఉంటేనే రుణం మంజూరై కేంద్రం నిర్వహణకు వీలవుతుంది. తొలుత కొందరు ఉత్సాహం చూపలేదని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సరోజిని పేర్కొన్నారు. త్వరలోనే కియోస్కులు అందజేసి సేవా కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నర్సీపట్నం పరిధిలో తొలుత 53 మందికి ఈ పథకం వర్తింపజేయాలని తొలుత ప్రతిపాదించారు. తగినంత ఆదాయం లేకపోతే నెల నెలా ఈఎంఐలు చెల్లించలేమని చాలామంది ముందుకు రాలేదు. దీంతో సచివాలయాల పరిధిలో ఒక్కొక్కరు చొప్పున 17 మందికి వర్తింపజేయాలని నిర్ణయించారు. ఎలమంచిలిలో 13 మందిని ఎంపిక చేశారు. వీరికి కియోస్క్ అందజేసి రూ.3 లక్షల రుణంతో ఇళ్ల వద్దే కామన్ సర్వీస్ సెంటర్ నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆన్‌లైన్ సేవలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. బయోమెట్రిక్ డివైజ్‌లు అందజేశారు. ఐడీ నంబరు కేటాయించడంతో ఇళ్ల వద్ద తాత్కాలికంగా సేవలందించే విధంగా సన్నద్ధం చేశారు

# ప్రభుత్వ భూముల కబ్జా



**సబ్బవరం, విశాఖసమాచారం:** సబ్బవరం, మండలంలోని వెదుళ్లనరవ (జీవీఎంసీ పరిధి)లో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల దురాక్రమణ జరిగిపోతున్నది. సమీపంలో వున్న కూర్మన్నపాలెం, దువ్వాడ, గాజువాక ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఇక్కడ భూములకు, స్థలాలకు గిరాకీ పెరిగింది. గజం స్థలం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతున్నది.వెదుళ్లనరవలో జిరాయితీ భూముల కంటే ప్రభుత్వ భూములే అధికంగా వుండడంతో కొంతమంది నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేయడం మొదలుపెట్టారు. పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను ఇప్పటికే కొంతమంది రియల్టర్లు, రాజకీయ నేతలు తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. సమీపంలో వున్న జిరాయితీ భూముల సర్వే నంబర్లతో ప్రభుత్వ భూములను అమ్మేస్తున్నారు. కానీ కొనుగోలుదారులకు ఇది ప్రభుత్వ భూమి అని తెలియక, పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కొంతమంది స్థలం చుట్టూ ప్రహరీగోడలు నిర్మించారు. ఇక్కడ ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ విక్రయాల విషయంలో అధికార, విపక్ష నాయకులు ఏకతాటిపై నడుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా ఈ భూముల్లో ఎక్కువ శాతం వైసీపీ నేతల చేతుల్లో వున్నాయి. ఇప్పుడు కూటమి నేతల సహకారంతో విక్రయాలు జరుపుతూ, వచ్చిన సొమ్మును పంచుకుంటున్నారు. కాగా ప్రభుత్వ భూముల ఆక్రమణ, చేతులు మారుతుండడంపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెదుళ్లనరవ 113 సర్వే నంబర్‌లో 1.85 ఎకరాల ప్రభుత్వ భూమి, గెడ్డ వున్నాయి. 114 సర్వే నంబర్‌లో 3.44 ఎకరాల ప్రభుత్వ బంజరు భూమి ఉంది. ఈ రెండు నంబర్లలో ఉన్న మొత్తం 5.29 ఎకరాలను స్థానిక నేతలు ఆక్రమించడమే కాకుండా ఏకంగా విక్రయించేశారు. కొనుగోలు చేసిన వారు స్థలాల చుట్టూ ప్రహరీ గోడలు నిర్మిస్తుండడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. సర్వే నంబరు 113తోపాటు సర్వే నంబరు 121లోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటువైపు కన్నెత్తి అయితే చూడలేదని చెబుతున్నారు. ఇంకా సర్వే నంబరు 34లో 15.02 ఎకరాల భూమి ఉంది ఇందులో సుమారు నాలుగు ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో వుండగా, మిగిలినది డి.పట్టా భూమి. మొత్తం 15.02 ఎకరాలు గతంలోనే చేతులు మారింది. ఇక్కడ స్థలాల్లో కొంతమంది ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరు ప్రహరీగోడలు నిర్మించారు. సర్వే నంబరు 33లో సుమారు ఐదు ఎకరాల్లో అల్లిమెట్ట ఉంది. దీనిపై ఆలయం నిర్మించేందుకు స్థానిక నేతలు యంత్రాలతో చదును చేయించారు. ఇదే అదనుగా భావించి కొంతమంది అల్లిమెట్ట చుట్టూ ఉన్న స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.

# ఆచూకీ లేని షీ టీమ్స్



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహార కల్తీ జరగకుండా నియంత్రించేందుకు ఏర్పాటుచేసిన 'శానిటేషన్, హెల్త్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (షీ)' బృందాలు ఆచూకీ లేవు. కొత్తలో హోటళ్లు, అల్పాహార దుకాణాల్లో ఎడాపెడా తనిఖీలు చేసిన ఈ బృందాలు ఆ తర్వాత ఏమయ్యాయో తెలియదు. రాజమండ్రిలో కల్తీ పాల ఉదంతం నేపథ్యంలో షీటీమ్స్‌ను తిరిగి క్రియాశీలకం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

వ్యాపారం బాగుండడంతో నగరంలో ఎక్కడికక్కడ హోటళ్లు, అల్పాహార సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలుస్తున్నాయి. అయితే లాభార్జనే ధ్యేయంగా కొందరు ఆహార తయారీలో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. హానికరమైన రంగులను వినియోగిస్తున్నారు. దీనివల్ల చాలామంది అనారోగ్యం బారినపడుతున్నారు. కల్తీకి అడ్డుకట్ట వేసేందుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరు నెలల కిందట 'షీ' టీమ్స్‌కు రూపకల్పన చేశారు. ఒక్కో టీమ్‌లో ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఇద్దరు వార్డు శానిటరీ సెక్రటరీలను నియమించారు. ఒక్కో జోన్‌కు ఒక్కో బృందం చొప్పున పది బృందాలను ఏర్పాటుచేశారు. ఆయా బృందాలు తమ జోన్ పరిధిలోని హోటళ్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. హోటల్/బేకరీ/ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ లోపల పరిశుభ్రత, వినియోగదారులకు అవసరమైన సదుపాయాల కల్పన, ఆహార తయారీ విధానం, అందుకు వినియోగిస్తున్న పదార్థాల నాణ్యతను పరిశీలించాలి. ఎక్కడైనా నాణ్యత లోపించినా, ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగించినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధ్యులైన వారిపై కేసులు నమోదుచేయించడం, జరిమానా విధించడం చేయాల్సి ఉంటుంది. ఒకవేళ నాణ్యతను నిర్ధారించడంలో కొన్ని అనుమానాలు ఉంటే నమూనాలను తీసి స్టేట్ ఫుడ్ సేఫ్టీ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించాలి. నాణ్యతాలోపం ఉన్నట్టు లేదా ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగిస్తున్నట్టుగానీ తేలితే దుకాణాలపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తారు.

షీ టీమ్స్ ఏర్పాటుచేసిన మొదట్లో ఆయా చాలా హడావిడి చేశాయి. తమ పరిధిలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేసి విరివిగా జరిమానాలు విధించాయి. కానీ తర్వాత ఏమైందోగానీ బృందాల జాడలేకుండా పోయింది. ఇటీవల కాలంలో హోటళ్లలో ఆహారకల్తీ, నిల్వ పదార్థాలు వినియోగం పెరిగిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజమండ్రిలో కల్తీపాల నేపథ్యంలో అధికారులు స్పందించి 'షీ' టీమ్స్‌ను తిరిగి క్రియాశీలకం చేయాలని కోరుతున్నారు.

# అలజడి నడుమ వారు ఆవేదనలో అయినవారు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** అనకాపల్లి, నర్సీపట్నం అర్బన్ : పశ్చిమాసియాలో ఇరాన్‌– ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా అనకాపల్లి జిల్లాలోని వందల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. దుబాయ్, బహ్రెయిన్, కువైట్ వంటి గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా జిల్లావాసులు ఉపాధి పొందుతున్నారు. అక్కడి పరిస్థితులు భయానకంగా ఉండటంతో జిల్లాలోని వారి కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బహ్రెయిన్ దేశంలో జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం, నాతవరం, చోడవరం, లక్కవరం ప్రాంతాలకు చెందిన ప్రవాసాంధ్రులు అధికంగా ఉన్నారు. వీరిలో చాలామంది కొన్నేళ్లుగా అక్కడే ఉంటున్నారు. కువైట్, దుబాయ్‌లోనూ జిల్లావాసులు వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఉంటున్న కొంతమంది స్వగ్రామానికి తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అక్కడ విమానాలు రద్దవ్వడంతో తిరిగి రాలేని పరిస్థితి. జనావాసాలు, విమానాశ్రమాలు, క్రూడాయిల్ బావుల సమీపంలో క్షిపణులు, డ్రోన్ బాంబులు పడుతున్నాయని.. దీంతో ఇంటికే పరిమితమయ్యామని ఇక్కడి బంధువులకు తమ వేదన వినిపిస్తున్నారు. బహ్రెయిన్, దుబాయ్, కువైట్ దేశాల్లో ఉన్న జిల్లా వాసులకు భారతీయ ఎంబసీ అండగా నిలుస్తుంది. క్షిపణులు, డ్రోన్ల దాడులు జరిగిన ప్రాంతాల్లోని భారతీయులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. అక్కడి ప్రభుత్వాలతో మన దేశానికి చెందిన అధికారులు చర్చిస్తున్నారని.. ప్రత్యేక విమానాలు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని, సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొస్తామని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారని నాతవరానికి చెందిన శెట్టి సతీష్ చెప్పారు. గల్ఫ్, ఇండియన్ కరెన్సీకి వ్యత్యాసం అధికంగా ఉంటుంది. కొన్ని సంవత్సరాలు అక్కడ కష్టపడితే వచ్చే స్వస్థలంలోనే స్థిరపడొచ్చని అప్పులు చేసి రూ. 1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చు చేసిమరీ జిల్లావాసులు గల్ఫ్ దేశాలకు వెళ్లారు. సమీప ప్రాంతాల్లోనే దాదులు మా స్వస్థలం బుచ్చెయ్యపేట. పదేళ్లుగా బహ్రెయిన్‌లోని రాయల్ కోర్టులో ఉద్యోగం చేస్తూ.. కుటుంబంతో సహా ఉంటున్నాం. రెండు రోజులుగా మాకు 3 కి.మీ. దూరంలో రాత్రింబవళ్లు దాదులు జరుగుతున్నాయి. భయం వస్తోంది. అమెరికన్ బేస్‌లు, హోటల్స్ ఉన్న ప్రాంతాల్లో దాదులు జరుగుతున్నాయి. అత్యవసరమైతే తప్పితే.. బయటకు వెళ్లొద్దని ప్రభుత్వం సూచిస్తోంది. దాదులు జరుగుతున్న ప్రాంతాల్లో మన తెలుగువారు నివాసముంటున్నారు. మా ఇంట్లో వైజాగ్, రాజమండ్రి, కాకినాడకు చెందిన పలు కుటుంబాలకు ఆశ్రయం కల్పించాం. ప్రభుత్వం మమ్మల్ని వీలైనంత త్వరగా స్వస్థలాలకు చేర్చాలని కోరుతున్నాం. గల్ఫ్ దేశాలకు వెళ్లారు. సమీప ప్రాంతాల్లోనే దాదులు

మా స్వస్థలం బుచ్చెయ్యపేట. పదేళ్లుగా బహ్రెయిన్‌లోని రాయల్ కోర్టులో ఉద్యోగం చేస్తూ.. కుటుంబంతో సహా ఉంటున్నాం. రెండు రోజులుగా మాకు 3 కి.మీ. దూరంలో రాత్రింబవళ్లు దాదులు జరుగుతున్నాయి. భయం వస్తోంది. అమెరికన్ బేస్‌లు, హోటల్స్ ఉన్న ప్రాంతాల్లో దాదులు జరుగుతున్నాయి. అత్యవసరమైతే తప్పితే.. బయటకు వెళ్లొద్దని ప్రభుత్వం సూచిస్తోంది. దాదులు జరుగుతున్న ప్రాంతాల్లో మన తెలుగువారు నివాసముంటున్నారు. మా ఇంట్లో వైజాగ్, రాజమండ్రి, కాకినాడకు చెందిన పలు కుటుంబాలకు ఆశ్రయం కల్పించాం. ప్రభుత్వం మమ్మల్ని వీలైనంత త్వరగా స్వస్థలాలకు చేర్చాలని కోరుతున్నాం.

# నత్తనడకన మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు



**ఎలమంచిలి, విశాఖసమాచారం:** స్థానిక మునిసిపాలిటీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పది నెలల క్రితం శంకుస్థాపన చేయగా, స్థల సమస్య కారణంగా నెల రోజుల క్రితం పనులు మొదలుపెట్టారు. మొత్తం నాలుగు యూనిట్లకు గాను ప్రస్తుతం రెండు యూనిట్లు మాత్రమే ఏర్పాటవుతున్నాయి. మిగిలిన రెండు యూనిట్లకు స్థలాన్ని అన్వేషిస్తున్నారు. పట్టణంలో నివాసాలు, వాణిజ్య సముదాయాలు, ఇతర భవనాల నుంచి వచ్చే వాడుక నీటిని గెడ్డలోకి విడుదల చేస్తున్నారు. దీనివల్ల దోమలబెడదతోపాటు పట్టణానికి ఆనుకొని వున్న పొలాల్లోకి మురుగునీరు చేరుతున్నది. ఈ సమస్యను నివారించడానికి స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ (ఎస్ఏసీ) నిధులు రూ.2.13 కోట్లతో నాలుగుచోట్ల మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పట్టణంలో శేషుకొండ సమీపంలో పెదపల్లి రోడ్డు పక్కన రూ.75 లక్షల వ్యయంతో 0.4 ఎంఎల్‌డీ సామర్థ్యంతో, తెరువుపల్లి వార్డులో రూ.93 లక్షలతో 0.5 ఎంఎల్‌డి సామర్థ్యంతో, కొత్తపాలెం వార్డులో రూ.20 లక్షలతో 0.109 ఎంఎల్‌డీ సామర్థ్యంతో, మంత్రిపాలెం, పెద్దగొల్లలపాలెం ప్రాంతంలో రూ.25 లక్షలతో 0.138 ఎంఎల్‌డీ సామర్థ్యంలో మురుగునీటి శుద్ధి యూనిట్లను నిర్మించాలని ప్రతిపాదించారు. సుమారు పది నెలల క్రితం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అయితే స్థల సేకరణలో జాప్యం కారణంగా నెల క్రితం వరకు పనులు ప్రారంభించలేదు. ఎట్టకేలకు శేషుకొండ, తెరువుపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో వుండడంతో మురుగునీటి శుద్ధి యూనిట్ల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. కాంక్రీట్ ప్లాట్ ఫారం పనులు పూర్తి చేశారు. శుద్ధి ప్లాంట్‌కు సంబంధించిన విడిభాగాలను రప్పించి, అమరుస్తున్నారు. రెండు, మూడు నెలల్లో ఇక్కడ పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో మిగిలిన రెండుచోట్ల స్థలాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అసాంఘిక కార్యకలాపాలు

**మహారాణిపేట, విశాఖసమాచారం:** ద్వారకా నగర్‌లోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ ప్రాంగణం రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. మందుబాబులు, గంజాయి, మత్తు పదార్థాలు సేవించేవారు, వ్యభిచారుల సంచారంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఆకతాయి చేష్టలతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు. వారిని ఎదుర్కొనలేక చాలామంది తలవంచుకుని వెళ్లిపోతున్నారు. ఆర్‌టీసీ అవుట్ గేట్ వద్ద ప్రయాణికుల ముసుగులో కొందరు యువకులు హల్‌చల్ చేస్తున్నారు. ఒంటరిగా వచ్చే ప్రయాణికులపై దాడులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపైనే తిరగబడ్డారు. రక్షణగా ఉన్న హెడ్ కానిస్టేబుల్, సిబ్బందిని కొట్టారు. మహిళా ఎస్ఐ, సిబ్బందితో కలిసి ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆర్‌టీసీ కాంప్లెక్సులో తనిఖీలు చేస్తున్నారు. అవుట్ గేట్ సమీపంలో ఆరుగురు మద్యం మైకంలో గొడవ చేస్తుండడం చూసి...వెళ్లిపోవాలని సూచించారు. దీంతో వారు ఎస్ఐపై తిరగబడ్డారు. కొంత గొడవ జరగడంతో సమీపంలో విధుల్లో ఉన్న పోలీసులు అక్కడకు చేరుకోగా,




వారిపై ఆ యువకులు దాడికి దిగారు. పక్కనే ఉన్న లలితా నగల దుకాణం అద్దాలను పగులగొట్టారు. అనంతరం అక్కడ నుంచి పరారవుతుండగా, ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఆర్టీసీ కాంప్లెక్స్, ఇతర ముఖ్య ప్రాంతాల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల కట్టడికి అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

# చందనోత్సవానికి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

**సింహాచలం, విశాఖసమాచారం:** సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని (నిజరూప దర్శనం) ఏప్రిల్ 20న నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జె.వెంకటరావు తెలిపారు. తన కార్యాలయంలో ఆయన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ స్వామివారి నిజరూప దర్శనానికి ఈ ఏడాది సుమారు 1.4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్తల కుటుంబ సభ్యులు తొలిదర్శనం చేసుకుంటారని, ఆ తరువాత ఉదయం ఐదు గంటల వరకు మాత్రమే ప్రొటోకాల్ దర్శనాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. కేటాయించిన స్లాట్ల ప్రకారం ఐదు గంటల వరకు మాత్రమే ప్రముఖులకు అంతరాలయ దర్శనాలు ఉంటాయన్నారు. సాధారణ భక్తులకు తెల్లవారుజామున మూడు నుంచి రాత్రి పది గంటల వరకూ నిర్విరామంగా నిజరూప దర్శనం సంతృప్తికరంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉచిత, రూ.300, రూ.1,000, రూ.1,500 టికెట్ల ద్వారా దర్శనాలు చేసుకునే భక్తుల కోసం పటిష్ఠమైన క్యూల నిర్మాణం జరుపుతున్నట్టు పేర్కొన్నారు. క్యూలో పది వేల మంది నిరీక్షించేందుకు వీలుంటుందన్నారు. గంటకు సుమారు ఆరు వేల మంది దర్శించుకుంటారని అంచనా వేశామని చెప్పారు. గతానికి భిన్నంగా దర్శన టికెట్లు విక్రయాలను మూడు రోజుల ముందే ముగిస్తామని చెప్పారు. బయటకు వచ్చే మార్గం తక్కువ కావడంతో దక్షిణ ద్వారం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తుల క్యూ మార్గంలో మూడు చోట్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు కొండ దిగువన, ఎగువన ప్రత్యేక స్థలాలు ఎంపిక చేసినట్టు ఈవో తెలిపారు. భక్తుల రాకపోకల కోసం దేవస్థానం 70 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుందన్నారు. చందనోత్సవానికి వచ్చే ప్రముఖులతో సహా అందరూ తమ వాహనాలను కొండ దిగువనే నిలిపివేసి దేవస్థానం ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాల్లో మాత్రమే సింహగిరికి రాకపోకలు సాగించాల్సి ఉంటుందని ఈఓ స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారుల సహాయ సహకారాలతో చందనోత్సవం విజయవంతానికి కృషి చేయనున్నట్టు ఈఓ చెప్పారు.

# కంబాలకొండలో అంతరిస్తున్న వన్యప్రాణులు

**మహారాణిపేట, విశాఖసమాచారం:** పీఎంపాలెం, ప్రకృతి పరిరక్షణలో కీలకపాత్ర పోషించే వన్యప్రాణులు అంతరిస్తుండ టం ఆందోళన కలిగిస్తోంది. విశాఖ నగరానికి తలమానిక మైన కంబాలకొండ అభయారణ్యంలో ఒకప్పుడు సందడి చేసిన జంతువులు రోజురోజుకీ కనుమరుగవుతున్నాయి. వాతావరణ మార్పులు, వేసవిలో నీటి ఎద్దడి, పెరిగిన జన సంచారం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. నేడు వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా వాటి మనుగడపై కథనం. నగర పరిధిలో సుమారు 17,740 ఎకరాల విస్తీర్ణంలో కంబాలకొండ అభయారణ్యం ఉంది. ఇక్కడ గతంలో చిరుతలు, ఎలుగుబంట్లు, పొట్టి నక్కలు, పునుగుపిల్లులు తదితర 15 రకాల జంతువులు సంచరించేవి. 2014లో హుద్‌హుద్ తర్వాత వీటి సంఖ్య గణనీయంగా తగ్గింది. ముళ్ల, అడవి పందులు, కొండ మేకలు, చుక్కల జింకలు, కణుజులు, రేచుకుక్కలు, అడవినక్కలు వంటివి మాత్రమే మిగిలాయి. గత పదేళ్లలో సగానికి పైగా జంతువులు అంతరించాయి.తాగునీటికి యాతన: అటవీప్రాం తంలో సహజ నీటి వనరులైన తుమురు, డేగల, మాతల తదితర గెడ్డలకు సంరక్షణ లేక వేసవి ఆరం భంలోనే ఎండిపోతున్నాయి. శంభువాని పాలెం, దబ్బంద తదితర ప్రాంతాలతో పాటు పలుచోట్ల గతంలో నిర్మించిన నీటి తొట్టెలు ప్రస్తుతం శిథిలమ య్యాయి. దీంతో మూగజీవాలు తాగు నీటి కోసం అల్లాడే పరిస్థితి వస్తోంది.

కానరాని కెమెరాలు..: అటవీ ప్రదేశంలో జంతువుల కదలికలను గుర్తించేందుకు ఏటా వేసవిలో సుమారు పదికి పైగా ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసేవారు. రెండు నెలల తర్వాత వాటిలో చిత్రాలను బట్టి జంతువుల సంచారంపై నివేదిక సిద్ధం చేస్తారు. గత మూడేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. వాహనాలు ఢీకొని..: కొంత కాలంగాఅటవీ ప్రదేశం నుంచి చుక్కల జింకలు, కణుజులు దారి తప్పి జనావాసాల్లోకి వస్తున్నాయి.

ఈ క్రమంలో వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నాయి. గడిచిన మూడేళ్లలో కంబాలకొండ నుంచి బోయపాలెం మధ్య జాతీయ రహదారిపై సుమారు 10 జింకలు, 2 కణుజులు మృత్యువాత పడ్డాయి. మూడు జింకలు కుక్కల దాడిలో మృతి చెందాయి. తక్షణ చర్యలు అవసరం: అంతరించిపోతున్న జీవజాతుల సంరక్షణకు ప్రభుత్వ సహకారంతో అటవీశాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. కూనలకు జంతువులు జన్మనిచ్చే సమయంలో, పక్షులు గుడ్లు పొదిగే క్రమంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి. అటవీ ప్రదేశాల్లో వాహనాల రాకపోకలను నిషేధించాలి. అడవి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి.

విశాఖ సమాచారమ్
బుధవారం 4-3-2026

# పెద్దన్న యుద్ధోన్మాదం..

ఇజ్రాయెల్‌తో కలిసి, ఇరాన్‌పై దాడులు జరపడం అమెరికా దుందుడుకు వైఖరికి నిదర్శనం. దౌత్య పరమైన చర్చలు జరుగుతుండగానే, ప్రమాదకర స్థాయి కవ్వింపులేవీ కనబడకుండానే ఒక సార్వభౌమ దేశంపై దాడులు చెయ్యడాన్ని ప్రపంచదేశాలు ఖండించాల్సిందే.

ఇజ్రాయెల్‌తో కలిసి, ఇరాన్‌పై దాడులు జరపడం అమెరికా దుందుడుకు వైఖరికి నిదర్శనం. దౌత్య పరమైన చర్చలు జరుగుతుండగానే, ప్రమాదకర స్థాయి కవ్వింపులేవీ కనబడకుండానే ఒక సార్వభౌమ దేశంపై దాడులు చెయ్యడాన్ని ప్రపంచదేశాలు ఖండించాల్సిందే. పశ్చిమాసియాని నేరుగా అమెరికా యుద్ధరంగంగా మార్చేయడం ఖండనీయం. ఇజ్రాయెల్‌తో కలిసి, ఇరాన్‌పై దాడులు జరిపి ఆ దేశపు సుప్రీం అయితుల్లా ఖమేనీ సహా పదుల సంఖ్యలో ఉన్నతాధికారుల్ని, మాజీ దేశ అధ్యక్షుడిని, వందలాది పౌరుల్ని పొట్టన పెట్టుకోవడం, ఆవాసాల్ని ధ్వంసం చెయ్యడం అమెరికా దుందుడుకు వైఖరికి నిదర్శనం. దౌత్య పరమైన చర్చలు జరుగుతుండగానే, ప్రమాదకర స్థాయి కవ్వింపులేవీ కనబడకుండానే ఒక సార్వభౌమ దేశంపై దాడులు చెయ్యడాన్ని ప్రపంచదేశాలు ఖండించాల్సిందే.. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు, నాగరిక విధానాలకు ఈ చర్యలు పూర్తి వ్యతిరేకం. ట్రంప్ అధ్యక్ష పదవిలోకి వచ్చాకా భారత్ –పాక్‌ల మధ్య యుద్ధం జరగకుండా ఆపానంటూ.. తన పనికి నోబెల్ శాంతి బహుమతి రావాలంటూ. అలా నోటితో అంటూనే చేతల్లో మాత్రం వెనెజులా అధ్యక్షుడిని బందీగా ఎత్తుకుపోయింది అమెరికా. నేడు ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై ప్రత్యక్ష దాడులకు దిగింది. గత నాలుగు దశాబ్దాలుగా తనకి వ్యతిరేకంగా ఉన్న ఇరాన్‌ని ఆంక్షలతో కట్టడి చెయ్యలేక, అణ్వాయుధాల సాకుతో, అక్కడి అంతర్గత ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో మారణహోమం మొదలుపెట్టింది. ఇరాన్ అందుకు ప్రతిగా పశ్చిమాసియాలోని అమెరికా మిత్రదేశాలపై దాడుల్ని గురిపెడుతూనే హోర్మేజ్ జలసంధిని మూస్తున్నట్లు ప్రకటించింది. ఆ జలసంధి మూసివేతతో ఆయిల్ సరఫరా అంతరాయం ఏర్పడి ప్రపంచ దేశాలన్నీ నష్టపోతాయి. ఆర్థిక నష్టం మాట అటుంచితే, ఇలా ఒక దేశాన్ని తనకు నచ్చినప్పుడు ధ్వంసం చెయ్యడం అన్ని దేశాలకీ ప్రమాదం.. ఈ ధోరణిని స్పష్టంగా వ్యతిరేకించాలి. వాణిజ్య యుద్ధంలో తన పర భేదాలు లేవంటూ ట్రంప్ ఇప్పటికే తన విధానాల ద్వారా తెలియజెప్పారు. ఏ యుద్ధమైనా, ఎవరిపైన అయినా ఎప్పుడైనా చేస్తానంటూ ఆయన హుంకరిస్తే, అందుకు ప్రపంచదేశాలు మౌనం వహిస్తే ఆ ధోరణితో బలహీన దేశాలు బలిపీఠం ఎక్కుతాయి. కొత్త తీవ్రవాదం పుట్టుకు వస్తుంది. ఆర్థిక వ్యవస్థ, భద్రత, ప్రగతి గాలిలో దీపాలౌతాయి.. అందుకనే ఇరాన్‌పై దాడిని అందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన సందర్భమిది.

# హ్యూమనిజం – ప్రపంచ శాంతి – మానవాళి మనుగడ

నేటి ప్రపంచంలో ఉన్న అశాంతి ఆందోళనకర పరిస్థితులను చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. శాంతిలేకుండా మానవ జీవనం సుఖసంతోషాలతో ఉండదు. యుద్ధాలు, తీవ్రవాదం, హింస, అసమానతలు, ద్వేషం మనిషి అభివృద్ధికి ప్రధాన అడ్డంకి. శాంతి ఉండే చోట అభ్యాసం, సాంకేతికత, ఆర్థిక స్థిరత్వం, సాంస్కృతిక విలువలు అభివృద్ధి చెందుతాయి. ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు యుద్ధ మేఘాలు వడి వడిగా అలుముకుంటున్నాయి. రష్యా, యుక్రెయిన్ మధ్య; ఇజ్రాయిల్–అమెరికా, ఇరాన్ మధ్య; పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ; అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడో అక్కడ వివిధ దేశాలు, వివిధ మతాలు, వివిధ జాతుల మధ్య సరిహద్దుల వివాదం, భూ భాగం కోసం, మతోన్మాదం కోసం, అణ్వాయుధాల వ్యాపారం కోసం, మత్తు మందుల కొనుగోలు కోసం, లేక అగ్ర దేశాలు మధ్య ఆధిపత్య పోరు, అహంకారం, మూఢ విశ్వాసాలు... ఇలా ఎందుకో అందుకు ప్రతి నిత్యం యుద్ధ వాతావారణంలో అమాయకులైన ప్రజలు భయంతో బిక్కు బిక్కుమని బతుకుతున్నారు.

శాంతి అనేది కేవలం యుద్ధం లేకపోవడం మాత్రమే కాదు న్యాయం, సమానత్వం, గౌరవం, మానవ హక్కులు ఉండే స్థితి. అందుకే ప్రపంచంలోని ప్రతి వ్యక్తి శాంతి స్థాపనకు కృషి చేస్తేనే ఏమైనా ప్రపంచశాంతి సాధ్యమవుతుంది. కానీ నేటి ప్రపంచ పరిస్థితులు ఏ ఒక్క దేశం ఇంకో దేశం పట్ల నమ్మకంగా లేవు. దాదాపు మూడో ప్రపంచ యుద్ధ పరిస్థితిలే కనిపిస్తున్నాయి.

ఈనాడు చాలా దేశాలు మానవాళి మనుగడ కన్నా తమ అస్తిత్వ ప్రయోజనాలే ముఖ్యమని ఐక్య రాజ్యసమితి నియమాలను ఉల్లంఘించి ముందుకు సాగుతున్నాయి. అగ్ర రాజ్యాలు వర్తమాన దేశాల అనంతరంగిక పోరును పరోక్షంగా ప్రోత్సహిస్తూ ఆయుధాలను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఈరోజు పెరిగిన సాంకేతిక ప్రభావం వల్ల మనిషి విశ్వ మానవుడిగా వర్థిల్లుతున్నాడు కానీ పక్క దేశంలో ఏం జరుగుతే మనకేంటి అనే పరిస్థితిలో ఉన్నాడు. అది ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇబ్బందులు కలుగుతున్నాయి. కొన్ని తరాలు కోలుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల ప్రపంచ ప్రజలంతా శాంతిని కాపాడి అభివృద్ధి ద్వారా పాటుపడితే ప్రపంచం ఒక నిజమైన మానవ కుటుంబంగా నిలుస్తుంది. కానీ ఈనాడు మానవులు స్వార్థ జీవులుగా మారుతున్నారు. తనకు ఇబ్బంది కలిగే వరకు స్పందించకుండా దూరంగా ఉంటున్నాడు. ప్రపంచ శాంతి కోసమే ఉద్భవించిన ఐక్యరాజ్యసమితి కూడా తన ధర్మాన్ని నిర్వహించలేకపోతోంది.

ఐక్యరాజ్య సమితిలోని అగ్ర రాజ్యాల అధిపత్యం కొనసాగుతుండటం చిన్న దేశాలకు శాపంగా మారుతున్నది. అగ్ర రాజ్యాల చేతిలో ఉన్న ఐరాస తన లక్ష్యాలను నెరవేర్చలేక పోతున్నది. కాలం గడుస్తున్న కొద్దీ ఐరాస బలహీన పడుతున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 80ఏళ్ళ పాటు ప్రపంచ శాంతికి అవిరళమైన కృషి చేసిన ఐరాస మరో ప్రపంచ యుద్ధం రాకుండా చూడాలి. ఆ దిశగా కృషి చేస్తూ, మానవాళిని కాపాడ గలదని మనసారా అశిద్దాం. దేశాధినేతలు, మేధావులు వట్టి మాటలు కట్టిపెట్టి ప్రపంచశాంతి కొరకు గట్టి మేలు కలిగించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలి.

ఇటువంటి పరిస్థితుల్లో భారతీయులు హ్యూమనిజం స్ఫూర్తితో ప్రపంచ ప్రజల మధ్య స్నేహం, సామాజిక సంబంధాలు మరియు పరస్పర అవగాహన పెంచడానికి కృషి చేయడం ద్వారా ప్రపంచ శాంతికి నాంది పలకాలి. హ్యూమనిజం జీవితానికి శాంతిని, మరియు శ్రేయస్సుని సమగ్రంగా అందించే ప్రక్రియ. "మన కోసం, మరియు మన సమాజం కోసం హ్యూమనిజం" అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఐక్యత మరియు విశ్వ శాంతి స్థాపన కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మానవాళి కృషి చేయాలి. మానవుడు కూడా భగవంతుని సృష్టి నుండి వచ్చినప్పటికీ అతని బుద్ధి అహంకార ముతో కప్పబడి అతనికి భగవంతుడు ఇచ్చిన ఆశీస్సులన్నింటినీ తన వ్యక్తిగత విజయాలుగా భావించి, గొప్పవాడిననే అహంకారముతో తానే ఉంటాడు. ఎప్పుడయితే అతను అహంకారమును విడిచి పెడతాడో అప్పుడు అతని పరిధి అనంతమవుతుంది. వేదిక మీదకు ఎక్కి గొంతెత్తి శాంతి, శాంతి అని చెప్పినంత మాత్రాన ప్రపంచంలో శాంతి స్థాపన చేయలేము. మనిషిలోనే ప్రశాంతత లేనప్పుడు శాంతి సాధన కోసం చర్చలు జరపడంవలన ఫలితమేముంటుంది? ఒకవేళ ఏదో శాంతి కోసం చర్చలు జరుపుకున్నా, ఒప్పందం చేసుకున్నా కూడా ఏదో ఒక రూపంలో మళ్ళీ అశాంతి మొదలవుతుంది. ముందుగా శాంతి అనేది మనలో ఉండాలి. మనం అంతర్గతంగా మానసిక ప్రశాంతతతో ఉండాలి. అంతేగానీ మనలో అశాంతి ఉన్నప్పుడూ, అహకారంతో మనం కళ్ళు మూసుకొని ఉన్నప్పుడు, 'నేనెంతో ప్రశాంతంగా వున్నాను' అని అనుకోవడం కేవలం ఒక భ్రమ. మనశ్శాంతి అనేది ఆనందానుభూతిని కలిగించేదిగా ఉండాలి. శాంతి కోసమని యుద్దాలు చేయనవసరం లేదు. అది అంతర్లీనంగా ఆత్మ ద్వారా అనుభూతి చెందాలి. అంతర్గతంగా ప్రశాంతతతో వున్న వారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు మరియు అందరికీ ఆనందాన్ని పంచుతారు. ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న సమస్యలకు హ్యూమనిజం చక్కటి పరిష్కారం చూపిస్తుంది. ముందుగా శాంతి మనలో స్థిరపడి, ఆ స్థిరపడిన ఈ అంతర్గత శాంతి కేవలం మనల్నే కాక, మనచుట్టూ ఉన్న సమాజాన్ని, మొత్తం ప్రపంచాన్నే ప్రభావితం చేస్తుంది. అందుకే సాధన ద్వారా మరియు హ్యూమనిజం స్ఫూర్తితో మన భారతీయులందరూ విశ్వశాంతి కోసం నిరంతరం కృషి చేయాలి. ప్రపంచ మానవాళి శాంతియుత మనుగడ కోసం అందరం కలసి పాటుపడదాం.

**ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# హోలీ – చర్మ మరియు జుట్టు సంరక్షణ

ఈరోజు హోలీ ఆనంద రంగుల పండుగ. చెడును దహనం చేసి ప్రేమను పంచే హోలీ! కానీ మనం ఏది మంచో ఏది చెడో అర్థం కాని సమాజం లో ఈనాడు జీవిస్తూ ఉన్నాం.

ప్రకృతి తనను తాను పునరుద్ధరించుకుని, రిఫ్రెష్ చేసుకునే సమయంలో హోలీ జరుపుకుంటారు. వసంతకాలంలో వాతావరణంలో మార్పులు జరగటం వల్ల వైరల్ జ్వరం, జలుబు వస్తాయని ప్రజలు నమ్ముతారు. అందుకని సహజమైనరంగు పొడులను చల్లుకోవడంవలన ఔషదంగా పనిచేస్తుందని నమ్ముతారు. నిమ్మ, కుంకుమ, పసుపు బిల్వాలనుపయోగించి ఆయుర్వేద ఔషధవనమూలికలను తయారుచేస్తారు. తడిరంగుల కొరకు మోదుగ పుష్పములు రాత్రంతా మరిగించి అవి పసుపురంగులకు మారేంతవరకు ఉంచుతారు.

దానిని చల్లుకోవడం వలన ఔషధ గుణాలుండటంచేత మానవశరీరాలను కాపాడేది.

కానీ మనం వాడే నేటి పొడి "గులాల్" మరియు తడి రంగులు సహజ వనరుల నుండి తీసుకోబడలేదు. వాటిలో రసాయనాలు, మెరిసే మైకా కణాలు మరియు సీసం కూడా ఉంటాయి, ఇవి చర్మాన్ని ఇబ్బంది పెట్టడమే కాకుండా, తలమీద పేరుకుపోతాయి. హోలీని ఆరుబయట ఆడతారు కాబట్టి, సూర్యరశ్మి చర్మంపై కూడా హానికరమైన ప్రభావాన్ని చూపుతుంది. హానికరమైన ఖఎ రేడియేషన్‌తో పాటు, సూర్యరశ్మి చర్మాన్ని తేమను తగ్గిస్తుంది మరియు చర్మాన్ని టాన్ చేస్తుంది. హోలీ ఆడిన తర్వాత చర్మం పొడిగా మరియు నిస్తేజంగా మారవచ్చు.

మనం ఈరోజు పండుగలోకి వెళ్తున్నందున, వేడుకను సురక్షితంగా మరియు సరదాగా ఉంచడానికి ఇక్కడ ఒక చిన్న గైడ్ ఉంది.

హోలీకి ముందు ప్రిపరేషన్

మీకు మరియు "పక్కా" (శాశ్వత) రంగులకు మధ్య ఒక అడ్డంకిని సృష్టించడం ఇక్కడ మన లక్ష్యం.

ఆయిల్ అప్: మీ చర్మం మరియు జుట్టుకు కొబ్బరి, ఆలివ్ లేదా బాదం నూనె యొక్క ఉదారంగా పొరను పూయండి. ఇది రంగు నానబెట్టకుండా నిరోధిస్తుంది మరియు తరువాత కడగడం చాలా సులభం చేస్తుంది.హో

మీ గోళ్లను రక్షించండి: ముదురు నెయిల్ పాలిష్ యొక్క మందపాటి కోటు మీ గోళ్లకు వారాల పాటు మరకలు పడకుండా నిరోధిస్తుంది.హో

కంటి సంరక్షణ: కళ్ళకు నేరుగా తగలకుండా ఉండటానికి సన్ గ్లాసెస్ ధరించండి. మీరు కాంటాక్ట్స్ ధరిస్తే, మీ కార్నియాకు వ్యతిరేకంగా రసాయనాలు చిక్కుకోకుండా ఉండటానికి ఆ రోజు అద్దాలకు మారడం ఉత్తమం.హో

జుట్టు సంరక్షణ: నేటి పొడి "గులాల్" మరియు తడి రంగులు సహజ వనరుల నుండి తీసుకోబడలేదు. వాటిలో రసాయనాలు, మెరిసే మైకా కణాలు మరియు సీసం కూడా ఉంటాయి, ఇవి నెత్తిపై పేరుకుపోయి చికాకు కలిగిస్తాయి. హోలీ ఆడటానికి ముందు రక్షిత లీవ్–ఆన్ కండిషనర్ లేదా హెయిర్ సీరంను రాసుకోవడం మంచిది. అవి జుట్టును పూత పూసిన రసాయన రంగులు, కాలుష్య కారకాలు మరియు సూర్యరశ్మి నుండి రక్షిస్తాయి. అవి జుట్టుకు మెరుపును కూడా ఇస్తాయి. జుట్టును కడుక్కోవడానికి, ముందుగా పొడి రంగులు మరియు చిన్న మైకా కణాలను కడిగివేయడానికి పుష్కలంగా సాదా నీటితో శుభ్రం చేసుకోండి. తర్వాత తేలికపాటి హెర్బల్ షాంపూని అప్లై చేసి, వేళ్లతో జుట్టులోకి రాయండి. నెత్తిని సున్నితంగా మసాజ్ చేసి మళ్ళీ నీటితో బాగా కడగాలి. ఒక కప్పు నీటిలో ఒక నిమ్మకాయ రసాన్ని కలిపి చివరిగా శుభ్రంగా వాడండి. ఇది నెత్తి యొక్క ఆమ్ల–ఆల్కలీన్ సమతుల్యతను పునరుద్ధరించడానికి సహాయపడుతుంది.

స్మార్ట్ డ్రెస్: పాత, పూర్తి చేతుల కాటన్ దుస్తులను ధరించండి. మీరు చర్మాన్ని ఎంత ఎక్కువగా కప్పితే, అంత తక్కువగా స్క్రబ్ చేయాల్సి ఉంటుంది.

హోలీ సరదా సమయంలో

సహజమైన రంగులను ఎంచుకోండి: సేంద్రీయ రంగులు, గులాల్ లేదా పూల రేకులను వాడండి. సింథటిక్ రంగులలో తరచుగా లెడ్ ఆక్సైడ్, పాదరసం లేదా పిండిచేసిన గాజు కూడా ఉంటాయి.

హైడ్రేటెడ్ గా ఉండండి: ఎండ మరియు ఉత్సాహం మధ్య, డీహైడ్రేషన్ కు గురికావడం సులభం. రోజంతా నీరు తాగుతూ ఉండండి.

పెంపుడు జంతువుల భద్రత: దయచేసి జంతువుల నుండి రంగులను దూరంగా ఉంచండి. వాటి చర్మం చాలా సున్నితంగా ఉంటుంది మరియు ఆ పొడిని నాకడం వల్ల వాటికి విషపూరితం కావచ్చు.

హోలీ తర్వాత ఈ విధంగా శుభ్రం చేయవద్దు

గట్టిగా రుద్దకండి: తేలికపాటి సబ్బు లేదా క్లెన్సింగ్ మిల్క్ ఉపయోగించండి. మరకలు మొండిగా ఉంటే, కొద్దిగా నిమ్మరసం లేదా పెరుగు–బేసన్ (గ్రామ్ పిండి) పేస్ట్ రుద్దడం వల్ల అది సున్నితంగా తొలగిపోతుంది.

మాయిశ్చరైజ్ చేయండి: రంగులను కడిగిన తర్వాత మీ చర్మం పొడిగా ఉంటుంది. స్నానం చేసిన వెంటనే భారీ మాయిశ్చరైజర్ లేదా కలబంద జెల్‌ను వాడండి. దురద ఉంటే, ఒక కప్పు నీటిలో రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ వేసి చివరిగా శుభ్రం చేసుకోండి. ఇది దురదను తగ్గించడానికి సహాయపడుతుంది అయితే, దురద కొనసాగితే, దద్దుర్లు మరియు ఎరుపు ఉంటే, రంగుకు అలెర్జీ ఉండవచ్చు. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించండి.

ఎల్లప్పుడూ హోలీకి సహజ రంగులు వాడడం మంచిది. అందరికీ హోలీ శుభాకాంక్షలు.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు,**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం,**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం.**

# హిందూ మతం ఒక జీవన శైలి

హిందూ మతం అనేకంటే అది ఒక జీవన శైలి అంటే బాగుంటుందని మన రుషుల ఉవాచ. హిందూ మతం భగవంతుని అస్థిత్వాన్ని నిర్ధారిస్తుంది.భక్తులు కోరినవి తీర్చేవాడు భగవంతుడని భావిస్తారు.

దీనిమీద నమ్మకాలు, తప్పుఒప్పులు, వాదోపవాదాలు అనేకం పుట్టాయి. అసలు దేవుడు ఉన్నాడా,లేడా అని నిందాస్తుతి చేయడం మనం రామదాసు, తుకారాం లాంటి భక్తాగ్రేసరుల కథలలో చదువుతాం. భగవంతునికీ, భక్తునికీ వున్న బంధం తెలియాలంటే పురాణాలగూర్చి తెలుసుకోవాలి.

హిందూ మతం చాలా పురాతనమైనదని, వేదాలు క్రీ.పూ. 1500–1200 మధ్య కాలంలో పుట్టాయని, శాస్త్ర పండితుల,చరిత్రకారుల అభిప్రాయం. హిందువుల పవిత్ర గ్రంథాలు నాలుగు వేదాలు( శ్రుతులు) అంటారు.వాటిని అర్థం చేసుకోవడానికి ఆరు వేదాంగాలు(శిక్ష, వ్యాకరణ,ఛందో, నిరుక్త, జ్యోతిష, కల్పాలు) ఉన్నాయి.వీటిలో, వేద మంత్రాలు ఎలా చెప్పాలో(స్వర,వర్ణ విషయాలు)వివరించేది ' శిక్ష', 'వ్యాకరణం' అనగా వేద పద నిర్మాణం చెప్పేది. 'ఛందస్సు' అంటే మంత్రాలలో పాద,శ్లోక నియమాలని తెలిపేది. 'నిరుక్తం' అంటే పద అర్థాన్ని,ఆ పద ఉత్పత్తిని తెలిపేది. 'జ్యోతిషం' యజ్ఞ,యాగాదులకు ముహూర్త నిర్ణయాన్ని తెలిపే శాస్త్రం.'కల్పం' అనగా యజ్ఞ యాగాది క్రతువుల ఆచరణ విధానాన్ని తెలిపేది.

వేదాలు నాలుగింటిలో 'ఋగ్వేదం'పురాతనమైనది.ఇందులో 1028 సూక్తాలు,అగ్ని,ఇంద్ర,వరుణులు ముఖ్య దేవతలుగా స్తోత్రాలు ఉంటాయి. 'యజుర్వేదం'లో యజ్ఞ విధానం మంత్రాలు,పూజా విధులు వున్నవి.దీనిలో శుక్ల,కృష్ణ యజు శాఖలున్నాయి. 'సామ వేదం' సంగీత, గానరూప మంత్రాలు కల భక్తి ప్రాధాన్యత కలది. భారతీయ సంగీతానికి మూల మైనది. ఇక 'అధర్వణ' వేదంలో మానవ జీవనానికి కావాల్సిన ఆరోగ్య సంబంధిత రోగ నివారణ మంత్రాలు,శాంతి రక్షణ మంత్రాలు, గృహ జీవన, సామాజిక అంశాలు వుంటాయి. అధర్వణవేదం, ఉపవేదం ఆయుర్వేదం. ఇక ఉపవేదాలు ఆయుర్వేదం ఆరోగ్య సంబంధమైనది. ధనుర్వేదం ధనుర్విద్య , గాంధర్వం గాన సంబంధమైన, స్థాపత్యం దేవాలయ శిల్పకళగా ఉన్నాయి. వీటితోపాటు ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు కూడా వేదవాఙ్మయాలలో భాగాలు. ఉపనిషత్తులు అనగా బ్రహ్మవిద్య, ఆత్మ మోక్షం గురించి తెలిపే జ్ఞానాన్ని బోధించే వేదాల అంతిమ భాగాలు. మొత్తం 108,అందులో ప్రధానమైనవి పది (10) అవి ఈశాన, కేన,కథ,ప్రశాన,ముండక, కఠో, ఫ్రశ్న,మాండూక, తైత్తరీయ, ఐతేరేయ, ఛాందోగ్య,బృహదారణ్యక ఉపనిషత్తులు. ఇవి గురు ముఖతః మౌఖికంగా నేర్చుకునే రహస్య విద్యలు. వీటినే వేదాంతం అని కూడా అంటారు.ఇదంతా జ్ఞానకాండ. ఇక బ్రాహ్మణాలు అంటే యజ్ఞ కర్మలను,వైదిక ఆచారాలను, యజ్ఞ యాగాదులు ఏ విధంగా చేయాలి హోమగుండాలను ఎలా నిర్మించాలి లాంటి చేయవలసిన విధులు తెలుపుతాయి. కర్మకాండ. బ్రాహ్మణాలు మనిషిని కర్మల ద్వారా క్రమ శిక్షణ వైపు నడిపిస్తే, ఉపనిషత్తులు ఆత్మజ్ఞానం ద్వారా మానవునికి మోక్షసాధనకు సరైన మార్గం చూపుతాయి.

పురాణాలు..సృష్టి పరిణామాలు

అష్టాదశ (18)పురాణాలు కాలము,సృష్టి పరిణామం, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు,వారి విధులు వివరిస్తాయి.

బ్రహ్మ సృష్టికర్త, మహర్షుల సృష్టి,తర్వాత ప్రజాపతులు, వారి సంతానం. రాజులు వారి వంశాల సృష్టి,ఇంతేకాక భగవంతుని లీలలు మొదలైనవి.వాటితో పాటు ఇంకా వేదాలలోని నిగూఢార్థాలను సామాన్యులకు సరళంగా వివరిస్తాయి. ఆదిలో వేదవ్యాస మహర్షి పురాణ సంహిత అని సంస్కృతం లో వ్రాయగా, కాలక్రమేణా అవి 18 పురాణాలుగా రూపుదిద్దుకుని వ్యాప్తి చెందాయి. పురాణం అనగా పురాతనమైన విశిష్ట కథా విశేషం అని అర్థం. బ్రహ్మ,బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ, భవిష్య, భాగవత, మత్స్య, మార్కండేయ, విష్ణు, వామన, వరాహ, వాయు(శివ) ,గరుడ, అగ్ని,నారద,పద్మ,లింగ,కూర్మ, స్కంద పురాణాలు 18 ఉన్నాయి. ఈ పురాణాలను వేదవ్యాస మహర్షి తన శిష్యుడైన రోమహర్షణునికి (సూతమహర్షికి) చెప్పగా, ఆయన శౌనకాది మునులకు వివరించారు. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం, ఇవి క్రీ.పూ. 6– 3వ శతాబ్ది మధ్య చెప్పబడినవి. ఆపస్తంభ ధర్మ సూత్రాల ప్రస్తావనల ఆధారంగా ఈ విషయం తెలుస్తోంది. ఆ తర్వాత 12 వ శతాబ్ది వరకు పురాణ వాఙ్మయం అనేక మార్పులకు లోనయింది. పురాణాల పుట్టుక గురించి చెప్పాల్సివస్తే, పురాణాలు ఓంకారం(ప్రణవం) నుంచి ప్రభవించాయని, సంస్కృత భాగవతం 12వ స్కందంలో చెప్పబడింది. బ్రహ్మ ధ్యానంలో వుండగా, ఆయన హృదయం నుండి ఓంకార బీజాక్షరం ఉద్భవించి,అది సకల మంత్రాలకు మూలమైంది. దాని నుండి నాలుగు వేదాలు, త్రిలోకాలు, త్రిగుణాలు, జాగృత్,స్వప్న,సుషుప్తి మూడు అవస్థలు పుట్టాయి. చతుర్వేదాలను,బ్రహ్మ తన కుమారులైన మరీచి మొదలైన మిగతా వారికి ఇచ్చాడు. వారు కశ్యపునికి ఇలా పరంపరాగతంగా ఇచ్చి పుచ్చుకున్నారు.

వేదాలు సామాన్యులకు అర్థం కావని, వ్యాసమహర్షి, వేద ఉపనిషత్తుల సారమైన పురాణ సంహిత ద్వారా అష్టాదశ పురాణాలను అందరికీ అందుబాటులోకి తెచ్చాడు. ఆయన తన శిష్యుడైన సూత మహర్షి కివ్వగా, ఆయన నైమిశారణ్యంలోని మిగతా శుక,శౌనకాది మహా మునులకు బోధించాడు.

**బూర్గుల రామకృష్ణ సాయి**

# ప్రాణాంతక గడ్డలకు చెక్ పెట్టే దానిమ్మ



సాధారణంగా మనం దానిమ్మ పండ్లను ఆరోగ్యానికి మేలు చేస్తాయని తింటాం. కానీ ఆ చెట్టు ఆకులు, కొమ్మల్లో కూడా ప్రాణాలను రక్షించే అద్భుత ఔషధ గుణాలు ఉన్నాయని జపాన్‌లోని కుమామోటో యూనివర్శిటీ పరిశోధకులు తాజాగా గుర్తించారు. శరీరంలో పేరుకుపోయే ప్రమాదకరమైన 'అమిలాయిడ్' ప్రోటీన్ గడ్డలను ఇవి సమర్థవంతంగా విచ్ఛిన్నం చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

ఏమిటీ సమస్య..?

మన శరీరంలో 'ట్రాన్స్‌థైరెటిన్' అనే ప్రోటీన్ తన సహజ రూపాన్ని కోల్పోయి, గట్టి గడ్డల్లా మారి అవయవాల్లో పేరుకుపోతుంది. దీన్నే 'అమిలాయిడ్ ఎమైలాయిడోసిస్' అంటారు. ఇది ప్రధానంగా:

నరాల బలహీనత, చేతులు, కాళ్లు మొద్దుబారిపోవడం. గుండె జబ్బులు, గుండె కండరాలు బిగుసుకుపోయి వైఫల్యానికి దారితీయడం వంటి తీవ్ర సమస్యలను కలిగిస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మందులు కొత్త గడ్డలు ఏర్పడకుండా ఆపగలవు కానీ, ఇప్పటికే పేరుకుపోయిన పాత గడ్డలను తొలగించలేవు. కాబట్టి దానిమ్మ ఇలాంటి మొండి గడ్డలను సైతం అరికడుతుంది.

పరిశోధనలో తేలిందేమిటి అంటే..?

శాస్త్రవేత్తలు దాదాపు పదిహేను వందల రకాల మొక్కల సారాన్ని పరిశీలించగా, దానిమ్మ ఆకులు, కొమ్మల నుంచి తీసిన సారం అద్భుత ఫలితాలను చూపింది. అందులోని అనే రసాయనం అమిలాయిడ్ గడ్డలను నేరుగా ముక్కలు చేసినట్లు గుర్తించారు పరిశోధకులు. రోగుల నుంచి సేకరించిన గుండె కణజాలంపై ఈ రసాయనాన్ని ప్రయోగించగా, అది పేరుకుపోయిన ప్రోటీన్ గడ్డలను విజయవంతంగా విచ్ఛిన్నం చేసింది.

ప్రయోగశాలలో చిన్నపాటి జీవులపై జరిపిన పరిశోధనలో, ఈ దానిమ్మ రసాయనం వల్ల వాటిలోని ప్రోటీన్ నిక్షేపాలు తగ్గి, ఆయుష్షు పెరగడమే కాకుండా ఆరోగ్యం కూడా మెరుగుపడింది. దానిమ్మ ఆకుల్లోని ఈ ప్రత్యేక సమ్మేళనం కేవలం వ్యాధి పెరగకుండా ఆపడమే కాకుండా, ఇప్పటికే శరీరంలో ఉన్న హానికర నిక్షేపాలను తొలగించే అవకాశం ఉంది. ఇది ఎమైలాయిడోసిస్ చికిత్సలో ఒక కీలక మలుపని కుమామోటో యూనివర్శిటీ పరిశోధక బృందం చెబుతోంది.

# సెలవు అడిగితే.. పెళ్లి ఎమర్జెన్సీ కాదన్న బాస్



కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులు ఎన్నెన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో.. చాలా సందర్భాలలో తెలుసుకున్నాం. ఇప్పుడు తాజాగా ఓ సోషల్ మీడియా పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. వర్క్ కంటే పెళ్లి ముఖ్యం కాదని తమ బాస్ చెప్పినట్లు ఉద్యోగి వెల్లడించారు. నేను పనిచేస్తున్న కంపెనీలో.. నా నిశ్చితార్థం & వివాహం గురించి రెండు నెలల ముందే మేనేజర్లకు సమాచారం ఇచ్చాను. అయితే వాళ్లు దానిని సీరియస్‌గా తీసుకోలేదని.. పైగా పెళ్లి ఎమర్జెన్సీ కాదని చెప్పినట్లు ఉద్యోగి రెడ్డిట్ పోస్టు ద్వారా వివరించారు. దీనిపై పలువురు నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఉద్యోగం కంటే వ్యక్తిగత జీవితం ముఖ్యమని, అవసరమైతే కొంతకాలం ఉద్యోగం మానేయమని ఒకరు వెల్లడించగా.. చాలా కంపెనీలు ఇలాగే ఉన్నాయని, ఉద్యోగుల అవసరాలను సైతం గుర్తించడం లేదని మరొకరు వెల్లడించారు. జీవితంలో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ముఖ్యమని ఇంకొకరు అన్నారు.

కొన్ని సంస్థలు ఇప్పటికి కూడా పనికి ఇచ్చిన ప్రాధాన్యత.. ఉద్యోగులకు ఇవ్వడం లేదు. ఈ విషయంపై గతంలో చాలా వార్తలు వెల్లడయ్యాయి. "ఇంట్లో కూర్చుని ఎంతసేపని భార్యని చూస్తూ ఉంటారు?.. ఇంట్లో కంటే ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని మీ భార్యకు చెప్పండి. వారానికి 90 గంటలు పనిచేయండి. నేను ఆదివారాలు కూడా పనిచేస్తున్నా.. ఆరోజు మీతో పని చేయించలేక పోతున్నందుకు బాధపడుతున్నా" అంటూ గతంలో లార్సెన్ & టూబ్రో చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు.

# పింక్ ప్యారడైజ్‌గా బెంగళూరు, వైరల్ వీడియోలు



బెంగళూరు నగరంలో వసంతం ముందుగానే వస్తుంది. ప్రతీ వసంతంలో 'పింక్ ప్యారడైజ్'లా అద్భుతమైన అందతో అలరారుతుంది. అచ్చం జపాన్‌లోని 'చెర్రీ బ్లాసమ్స్' లాగే బెంగళూరులోని ఈ పూలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆకాశం నుండి చూస్తే గులాబీ దుప్పటి కప్పుకున్నట్టుగా కనిపించే ఈ అద్భుత దృశ్యం వెనుక ఒక గొప్ప వ్యక్తి కృషి ఉంది. పింక్ పూలతో స్వాగతం పలుకుతున్న బెంగళూరు వీధులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. బెంగళూరు 'పింక్ ప్యారడైజ్' వెనుక ఉన్న హీరో గురించి తెలుసుకుందాం. గార్డెన్ సిటీ బెంగళూరు ఇపుడు పింక్ ప్యారడైజ్‌లా దర్శనమివ్వడానికి కారణం సేతురాం గోపాల్‌రావు నేగిన్హాల్ అనే అటవీ అధికారి. ఆయన కేవలం అటవీ శాఖ అధికారిగా మాత్రమే కాకుండా, ఒక దార్శనికుడిగా పనిచేశారు. కర్ణాటక కేడర్‌కు చెందిన ఫారెస్ట్ ఆఫీసర్ సేతురామ్ గోపాలరావు నెగినహాల్ (రా.+. చీవస్త్రఱఅష్టుశ్రీ). 1980వ దశకంలో బెంగళూరు నగరం వేగంగా విస్తరిస్తున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి గుండూ రావు నగరాన్ని పచ్చదనంతో నింపే బాధ్యతను నెగినహాల్‌కు అప్పగించారు. అంతే అప్పటివరకు అడవుల పెంపకానికే పరిమితమైన అటవీశాఖ, మొదటిసారిగా నగర వీధుల్లో మొక్కలు నాటడం ప్రారంభించింది అటవీశాఖ. నెగినహాల్ కేవలం చెట్లను నాటడమే కాదు, ఏ వీధిలో ఏ చెట్టు ఉండాలో చాలా శాస్త్రీయంగా నిర్ణయించారు. 1982-1987 వీధివీధిన స్థానికులను అడిగి మరీ సుమారు 15 లక్షల మొక్కల్ని నాటించారు. మొక్కల్ని నాటడంతోనే చేతులు దులుపేసుకోలేదు ఆయన. నాటిన మొక్కల్ని పశువులు, ప్రజల నుండి కాపాడటం మొదలు, వాటిని సంరక్షణ లాంటి అనేక సవాళ్లను శ్రద్ధగా నిర్వహించారు.

నెగినహాల్ అద్భుతమైన ప్రణాళిక

బెంగళూరు వీధుల్లో ఒకేసారి ఒకే రంగు పూలు పూసేలా ఆయన ప్లాన్ చేశారు. వసంత కాలం వస్తే ఒక వీధి అంతా పసుపు రంగులో , మరో వీధి అంతా గులాబీ రంగులో) కనిపిస్తుంది. టాబెబుయా రోసియా (ఖుఎవ-ఎబఱఖు =శీంము): ఇప్పుడు మనం చూస్తున్న ఈ గులాబీ రంగు పూల చెట్లు నిజానికి విదేశీ జాతికి చెందినవి. ఇవి బెంగళూరు వాతావరణానికి బాగా సరిపోతాయని ఆయన గుర్తించి వేల సంఖ్యలో నాటించారు. (గర్ల్ ఫ్రెండ్ ద్వారానే ఎల్ మెంచో కథ ఖతం) 2024లో నెగినహాల్ ఈ భౌతిక ప్రపంచానికి దూరమైనా ఆయన నాటిన లక్షలాది చెట్లు ప్రతి ఏటా వసంత కాలంలో విరగబూస్తూ ఆయన ఉనికిని గుర్తు చేస్తుండటం విశేషం. ముఖ్యంగా కబ్బన్ పార్క్, లాల్‌బాగ్, మల్లేశ్వరం, జయనగర్ తదితర వీధుల్లో పూలు పూసినప్పుడు నేలంతా గులాబీ రంగు పూల రేకులతో నిండి పోయి అద్భుతంగా కనింపించే దృశ్యాన్ని చూసి తరించాల్సిందే. ఆయన దార్శనికత మరింతమందికి ఆదర్శం కావాలని ఆశిద్దాం.

# ఇదిగో... బ్లింకిబాండ్




'గుర్రాలు సినిమాలలో మాత్రమే కనిపిస్తాయి' అనుకునే వరకు వచ్చింది పరిస్థితి. అయితే నిత్యజీవితంలో ఎక్కడో ఒకచోట అవి మనుషులకు ఉపయోగపడుతూనే ఉన్నాయి. తాజా విషయానికి వస్తే... రాజస్థాన్‌లోని ఒక హైవేపై బ్లింకిట్ డెలివరీ బ్యాగ్‌ను గుర్రంపై మోసుకెళ్తున్న వృద్ధుడి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కంటెంట్ క్రియేటర్ కపిల్ బిష్ణోయ్ ఈ వీడియో క్లిప్‌ను 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు.

'ఇది రాజస్థాన్! యువకులకు గుర్రాన్ని స్వారీ చేసే అవకాశం ఇవ్వకుండా వృద్ధులు ఆన్‌లైన్ డెలివరీ చేస్తున్నారు' అని సరదాగా తన క్యాప్షన్‌లో రాశాడు కపిల్.

'ఆధునిక రహదారిపై గుర్రపు డెక్కల లయబద్ధమైన సంగీతం మాత్రమే వినిపిస్తుంది. ఎలాంటి గందరగోళం, హడావిడీ కనిపించదు' అనుకునేలా చేసిన ఈ తొమ్మిది సెకన్ల వీడియోను చూసి నెటిజనులు 'వావ్' అనడమే కాదు... 'కార్లు, బైక్‌ల వల్ల ట్రాఫిక్ జామ్ సమస్యతోపాటు పర్యావరణానికి కూడా హాని కలుగుతుంది.

ఈ నేపథ్యంలో గుర్రాలు పర్యావరణానికి హాని కలిగించని అద్భుతమైన రవాణా సాధనాలు' అంటున్నారు కొందరు. 'బ్లింకిట్'ను 'జేమ్స్‌బాండ్'ను కలిపి 'బ్లింకిబాండ్' అని నామకరణం చేశారు.

# కాస్త సరదాగా



సోషల్ మీడియాలో సరికొత్త ట్రెండ్... క్యారికేచర్ ట్రెండ్. పర్సనల్ ఫొటోలను చాట్‌జీపీటీలో క్యారికేచర్‌లలోకి మార్చడమే ఈ ట్రెండ్ సారాంశం. వ్యక్తిత్వం నుంచి అభిరుచుల వరకు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని అందుకు అనుగుణంగా క్యారికేచర్‌లను రూపొందిస్తున్నారు. ఈ కార్టూన్ఉస్టైల్ ఇమేజ్‌లు నెటిజనులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ట్రెండ్‌లో భాగం కావడానికి డ్రాయింగ్ స్కిల్స్, డిజైన్ సాఫ్ట్‌వేర్, ఎడిటింగ్ ఎక్స్‌పీరియెన్స్‌లాంటివేమీ అవసరం లేదు. జస్ట్... ఆసక్తి ఉంటే చాలు!

మీరు కూడా ఈ ట్రెండ్‌లో భాగం కావాలనుకుంటే... ఇలా చేయండి:

⟶ చాట్‌జీపీటీ ఓపెన్ చేసి లేటెస్ట్ వెర్షన్ (జీపీటిఉ4వో) ఎంపిక చేసుకోవాలి.

⟶ స్పష్టమైన, ఫ్రంట్ఉపేసింగ్ సెల్ఫీ లేదా ఫొటోను అప్‌లోడ్ చేయాలి.

⟶ 'క్రియేట్ ఏ క్యారికేచర్ ఆఫ్ మై మీ'... ఇలా ఇన్‌పుట్ ఇవ్వాలి.

⟶ మీ వృత్తి, అభిరుచులకు సంబంధించిన వివరాలను యాడ్ చేయాలి.

⟶ ఇమేజ్ జనరేట్ అయిన తరువాత డౌన్‌లోడ్ చేసుకోవాలి.

# శరీరం కూర్చోవటానికి కాదు



కంప్యూటర్ల ముందు కూలబడతాం. ల్యాప్‌టాప్‌లో ఒడిలో పెట్టుకొని చూస్తుంటాం. మొబైల్ ఫోన్లలో తల దూర్చకుండా ఒక్క నిమిషమైనా ఉండలేం. ఇలా ఆధునిక డిజిటల్ ప్రపంచం మనిషిని, పనులను పూర్తిగా మార్చేసింది. అన్నింటికీ పరికరాలే ఆధారం. గంటలకొద్దీ కూర్చోవటమే పని. దుస్తులు ఉతకటం, ఇల్లు ఊడ్చటం వంటి వాటికీ యంత్రాలే శరణ్యమవుతున్నాయి. సరుకులు కొనుక్కొని రావటానికీ గడప దాటాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే వచ్చేస్తాయి. ఒకవేళ బయటకు వెళ్లినా వాహనాల మీదే ప్రయాణం. మొత్తంగా మనిషి నడవటమే మరచిపోతున్నాడు. ఇది ఆరోగ్యాన్ని గణనీయంగా దెబ్బతీస్తోందన్న సంగతిని విస్మరిస్తున్నాడు..నిజానికి మన శరీరం కూర్చోవటానికి తయారైంది కాదు. నిటారుగా నిల్చోవటానికి, నడవటానికి, పరుగెత్తటానికి, గుంజీలు తీయటానికి, తరచూ కదలటానికి అనుగుణంగానే పరిణామం చెందింది. సుదీర్ఘంగా కూర్చోవటం మన సహజ భంగిమ కానే కాదు. కూర్చున్నప్పుడు మన తుంట్లు, మోకాళ్లు, మడమలు అదేపనిగా వంగిన స్థితిలో ఉంటాయి. ఇది రక్తప్రసరణ తగ్గటానికి దారితీస్తుంది. వెన్నెముకకు దన్నుగా నిలిచే వీపు, పిరుదుల కండరాల వంటివి క్రమంగా, చడీచప్పుడు చేయకుండా బలహీనమవుతాయి. గమనించాల్సిన విషయం ఏంటంటే- ఎక్కువసేపు కూర్చోవటం వల్ల తలెత్తే ప్రభావాలు వెంటనే కనిపించకపోవటం. ఇవి నెమ్మదిగా పొడసూపుతాయి. మొదట్లో ఎలాంటి లక్షణాలూ ఉండవు. కానీ క్రమంగా బలహీనత, ఒత్తిడి పెరిగిపోయి నడుం, మెడ, భుజాల నొప్పితో బయటపడుతుంది. మోకాళ్లు, తొడ నొప్పులూ బయలుదేరొచ్చు. రక్త ప్రసరణ లోపించటం, నాడులు నొక్కుకుపోవటం వల్ల కొందరికి కాళ్లు, పాదాలు మొద్దు బారొచ్చు, సూదులు పొడుస్తున్నట్టు అనిపించొచ్చు. దురదృష్టం కొద్దీ చాలామంది వీటిని పెద్దగా పట్టించుకోరు. వయసు మీద పడటం, బరువు పెరగటం, ఇతరత్రా జబ్బుల లక్షణాలుగానూ భావిస్తుంటారు.

జబ్బుల ముప్పులూ

కదలకుండా ఉండిపోవటం కండరాలు, కీళ్ల మీదే కాదు. ఇతరత్రా అంశాల పైనా ప్రభావం చూపుతుంది. జీవక్రియలు నెమ్మదిస్తాయి. బరువు, రక్తపోటు పెరుగుతాయి. మధుమేహం, గుండెజబ్బు వంటి దీర్ఘకాల సమస్యల ముప్పునూ పెంచుతుంది. కొన్ని రకాల క్యాన్సర్ల బారినపడే అవకాశమూ ఉంది. మానసిక ఆరోగ్యమూ దెబ్బతింటుంది. బద్ధకంగా ఉండిపోయేవారిలో ఆందోళన, కుంగుబాటు ఎక్కువగా కనిపిస్తుండటమే దీనికి నిదర్శనం. ఏం చేయాలి?

సమస్య గురించి తెలిస్తే పరిష్కారమూ కనిపించినట్టే. కాకపోతే గుర్తించటమే కావాలి. ఎక్కువసేపు కూర్చోవటం వల్ల తలెత్తే అనర్థాలను తగ్గించుకోవటానికీ ఇదే వర్తిస్తుంది. మనసుంటే మార్గం అదే దొరుకుతుంది. ఇది అంత కష్టమైందేమీ కాదు కూడా.

**కదలటం ముఖ్యం**

రోజుకు కనీసం 20 నుంచి 30 నిమిషాల సేపు ఒకింత తీవ్రమైన ఏరోబిక్ వ్యాయామాలు చేయటం మంచిదన్నది నిపుణుల సూచన. వేగంగా నడవటం, పరుగెత్తటం, సైకిల్ తొక్కటం, ఈత కొట్టటం, డ్యాన్స్ వంటివేవైనా చేయొచ్చు. ఒకవేళ ఇవి మొదట్లో కష్టంగా అనిపిస్తే రెండు, మూడు దఫాలుగా విభజించుకోవచ్చు. ప్రతి గంటకు ఐదు నిమిషాల సేపు నడిచినా మంచి మార్పు కనిపిస్తుంది. మొత్తమ్మీద వారానికి కనీసం 150 నిమిషాలు నడిచేలా చూసుకోవాలి.


**నిటారు డెస్క్‌లు**

డెస్క్ ఉద్యోగాలు చేసేవారు ప్రతి అరగంటకో, గంటకో ఓసారి లేచి నిల్చోవాలి. ఒంటిని సాగదీయాలి. ఆఫీసులో అటూఇటూ కాసేపు నడవాలి. వీలుంటే ఆఫీసు బయట పరుగెత్తొచ్చు కూడా. శరీరాన్ని అటూ ఇటూ వంచటం, గుంజీలు తీయటమూ చేయొచ్చు. నిల్చొని పనిచేసే డెస్క్‌లు ఉంటే ఇంకా మంచిది. కాసేపు నిల్చొని, కాసేపు కూర్చొని పనులు చేసుకోవచ్చు.

**ఇంటి పనులతో**

ఇంట్లోనూ వీలైనంతవరకూ ఎవరి పనులు వాళ్లే చేసుకోవటానికి ప్రయత్నించాలి. నిల్చొని వంట చేయొచ్చు, పాత్రలు తోమొచ్చు. వంగి ఇల్లు ఊడ్చొచ్చు, దుస్తులు ఉతకొచ్చు. దగ్గరలోని దుకాణాలకు వెళ్లేటప్పుడు వాహనాలకు బదులు నడిచి వెళ్లొచ్చు. నడుస్తూ ఫోన్ మాట్లాడటం, టీవీ చూస్తున్నప్పుడు ఒళ్లు విరుచుకోవటం వంటి తేలికైన మార్పులూ మంచి ఫలితం చూపిస్తాయి.

# నగరవాసులపై 'ఒత్తిడి' పంజా..



మారుతున్న జీవనశైలి, ఉరుకుల పరుగుల జీవితం నగరవాసులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. హిమాలయ వెల్‌నెస్ కంపెనీ దేశవ్యాప్తంగా 75 వేల మందిపై నిర్వహించిన 'నేషనల్ స్ట్రెస్ ఆడిట్'లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఒత్తిడి అనేది ఇప్పుడు కేవలం అప్పుడప్పుడు వచ్చే సమస్య కాదని, అది పట్టణ ప్రాంతాల్లో ఒక జీవనశైలి రుగ్మతగా మారిందని ఈ సర్వే స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా ఐటీ హబ్ బెంగళూరులో 22 శాతం మంది 'అత్యంత తీవ్రమైన ఒత్తిడి' ఎదుర్కొంటున్నట్లు తేలింది.

సర్వేలోని కీలక అంశాలు..

అతిగా ఆలోచించడం..89 శాతం మంది తాము అతిగా ఆలోచిస్తున్నా మని అంగీకరించగా, అందులో 83 శాతం మందికి ఇది అలవాటుగా మారింది. 63 శాతం మంది తమ జీవితం ఆశించిన రీతిలో సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ పనుల్లో 53 శాతం మంది శారీరక, మానసిక అలసట (దీబతీఅశీబ్) ఎదుర్కొంటున్నారు. 52 శాతం మంది తరచూ కోపం, ఆందోళనకు గురవుతున్నారు.

18 ఏళ్ల నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సు గల యువతలో ఒత్తిడి స్థాయిలు అత్యధికంగా ఉన్నాయి. 18-25 ఏళ్ల వయస్సు గల మహిళల్లో దాదాపు 45 శాతం మంది తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

**కారణాలు ఏమిటి..?**

కోవిడ్ తర్వాతి కాలంలో మానసిక సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. సుదీర్ఘ పని వేళలు, ట్రాఫిక్ ఇబ్బందులు, ఉద్యోగ భద్రత లేకపోవడం, ఇంటర్నెట్ వ్యసనం ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. సోషల్ మీడియాలో ఇతరులతో పోల్చుకోవడం వల్ల యువతలో అభద్రతా భావం పెరుగుతోందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ప్రభావం..**

తీవ్ర ఒత్తిడి వల్ల కేవలం నిద్రలేమి మాత్రమే కాకుండా.. దీర్ఘకాలిక తలనొప్పి, జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా త్వరగా ఫలితాలు సాధించాలనే తపన, పని ఒత్తిడి వల్ల 23-35 ఏళ్ల మధ్య వయస్కులు త్వరగా అలసిపోతున్నారు.ఒత్తిడిని జయించడానికి చిన్నపాటి మార్పులు అవసరమని క్లినికల్ సైకాలజిస్టులు సూచిస్తున్నారు.

ప్రతిరోజూ కనీసం 45 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయాలి.

సరైన సమయానికి నిద్రపోవడం, పనికి-వ్యక్తిగత జీవితానికి మధ్య స్పష్టమైన విభజన ఉండాలి.


స్క్రీన్ టైమ్ ,మొబైల్ వినియోగం తగ్గించాలి.

కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపడం, హాబీలను కొనసాగించడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.

సమస్య తీవ్రంగా ఉంటే నికోచించకుండా నిపుణుల సలహా తీసుకోవాలి.

ఒత్తిడి అనేది ఇప్పుడు కేవలం చిరాకుగా అనిపించే అంశం కాదు, అది మనిషి పనితీరును, సంబంధాలను దెబ్బతీస్తోంది. దీనిపై సామాజికంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందిని హిమాలయ వెల్‌నెస్ ప్రతినిధి వికాస్ బస్సీ పేర్కొన్నారు.

# రాబోయే 25 ఏళ్లలో మహిళల్లో గుండె జబ్బులు, స్ట్రోక్ కేసులు భారీగా పెరిగే అవకాశం



రాబోయే 25 ఏళ్లలో మహిళల్లో గుండె జబ్బులు, స్ట్రోక్ కేసులు భారీగా పెరిగే అవకాశం ఉందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ తాజా నివేదికలో వెల్లడైంది.. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ తెలిపింది. మహిళల ఆరోగ్యానికి సంబంధించి రాబోయే కాలం సవాల్‌గా మారనుందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ హెచ్చరించింది. ప్రస్తుత జీవనశైలి మార్పుల వల్ల రాబోయే 25 ఏళ్లలో మహిళల్లో గుండె జబ్బులు, పక్షవాతం (స్ట్రోక్) బారిన పడే వారి సంఖ్య విపరీతంగా పెరగవచ్చని అంచనా వేసింది. ముఖ్యంగా యువతుల్లో సైతం ఈ ముప్పు పొంచి ఉండటం గమనార్హం.

**ప్రధాన కారణాలు ఏమిటీ అంటే..?**

వ్యాధుల పెరుగుదలకు ప్రధానంగా మూడు కారణాలను నివేదిక ఎత్తిచూపింది. అటువంటివాటిలో.. ఊబకాయం (రాఎవంత్ఎ).. శారీరక శ్రమ తగ్గడం, ఆహారపు అలవాట్ల వల్ల బరువు పెరగడం గుండెపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మధుమేహం (ఱఖుఎవ్వం).. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల రక్త నాళాలు దెబ్బతిని గుండె పోటుకు దారితీస్తున్నాయి. అధిక రక్తపోటు (ఎఅస్త్రష్ట ద్రూ)..దీనిని 'సైలెంట్ కిల్లర్'గా అభివర్ణించిన వైద్యులు, యువతుల్లో కూడా బీపీ పెరగడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.

**ప్రస్తుత ధోరణి కొనసాగితే 2050 నాటికి పరిస్థితులు ఎలా ఉండవచ్చంటే..?**

ప్రతి 10 మంది మహిళల్లో 6 గురు ఏదో ఒక రకమైన గుండె సంబంధిత వ్యాధితో బాధపడే అవకాశం ఉంది. రక్తపోటు బాధితుల సంఖ్య 49శాతం నుంచి 60శాతానికి పెరగవచ్చు. ఊబకాయం బాధితులు 44శాతం నుంచి 61శాతానికి చేరుకోవచ్చని అంచనా.

**చిన్న వయసులోనే ప్రమాదం..**

గతంలో గుండె జబ్బులు అంటే వయసు పైబడిన వారికే వస్తాయనే భావన ఉండేది. కానీ, ఇప్పుడు 22 నుంచి 44 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో కూడా మధుమేహం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని, ఇది వారిని చిన్న వయసులోనే గుండె జబ్బుల బారిన పడేలా చేస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఎస్సీ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు



**వి.ఎల్.పురం :** గత వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. సీఎస్ఆర్, ప్రభుత్వ నిధులతో కొన్ని భవనాలను ఇప్పటికే మరమ్మతులు చేశారు. పంకాలు ఏర్పాటు చేసి, ప్రహరీలు నిర్మించారు. ప్రస్తుతం ఆర్వోప్లాంట్లు, సీసీకెమెరాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్యార్థులకు దోమతెరలు సరఫరా చేయనున్నారు. ముఖ్యంగా ఎస్సీ వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**దశలవారీగా..**

జిల్లాలో ఎస్సీ హాస్టళ్లు 33 ఉండగా.. ఎనిమిది గృహాల్లో రూ.66 లక్షలతో కమ్యూనిటీ సులభ్ కాంప్లెక్సుల తరహాలో స్నానపుగదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు దశలవారీగా చేపడుతున్నారు. గోకవరం, రాజానగరం, సమిశ్రగూడెం, తాళ్లపూడి, రేగులకుంట, యర్నగూడెం, కానూరు గౌరీపట్నంలోని గృహాల్లో గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

నాలుగు హాస్టళ్లకు ఆరు ఆర్వోప్లాంట్లు మంజూరు చేశారు. రాజమహేంద్రవరంలోని కళాశాల బాలుర వసతి గృహంలో రెండు, బాలికల వసతి గృహంలో ఒకటి, ప్రీమెట్రిక్ బాలికల గృహంలో ఒకటి, చిన్నయిగూడెం ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో రెండు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు.

**జూన్‌లోపు సీసీ కెమెరాలు ఏర్పాటు**

రెండో విడతగా మరో 16 హాస్టళ్లకు ఆర్వో ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. సమిశ్రగూడెం, దుద్దుకూరు, కొవ్వూరు, కొత్తపల్లి, నిడదవోలులో ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్, యర్నగూడెం, తాళ్లపూడి, కానూరు, అన్నదేవరపేట, రేకులకుంట, కందవల్లి, ధవళేశ్వరం రాజమహేంద్రవరంలోని వసతి గృహాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు సాంఘిక సంక్షేమాధికారి ఎండీ.గయాజుద్దీన్ తెలిపారు. మూడో విడతలో మిగిలిన వాటిల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తామన్నారు.జూన్ నాటికి అన్ని వసతి గృహాల్లో సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

## సర్వం.. రీ సర్వే మాయ..!




**కలెక్టరేట్ (రాజమహేంద్రవరం) :** గత వైకాపా ప్రభుత్వం 'భూ హక్కు-భూ రక్ష' పథకం పేరిట రైతులను నిండా ముంచింది. రీ సర్వే చేసి, కొందరి భూములను తారుమారు చేసింది. ఒకరి భూమిని మరొకరి పేరున కట్టబెట్టింది. భూవిస్తీర్ణం తగ్గించేసి హద్దులు మార్చేసింది. దస్త్రాల్లో భూ వివరాలకు ఆన్‌లైన్‌లో కన్పించే వాటికి పొంతన లేకుండా చేశారు. రీ సర్వేలో తమ భూమి విస్తీర్ణం తగ్గిపోయిందంటూ కొందరు, ఆన్‌లైన్‌లో తమకు బదులు వేరొకరి పేరు కన్పిస్తుందని మరికొందరు ఇలా పలువురు రైతులు అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అనేకసార్లు అర్జీలు అందించినా గత ప్రభుత్వంలో అవేమీ పట్టించుకోలేదు. భూసంబంధ సమస్యల పరిష్కారం, బాధితులకు న్యాయం చేసే ఉద్దేశంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టడంతో బాధిత రైతులు మళ్లీ అర్జీలు ఇచ్చేందుకు వస్తున్నారు.

**వినతుల వెల్లువ**

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), భూసంబంధ సమస్యల పరిష్కార వేదిక(రెవెన్యూ క్లినిక్)కు మొత్తం 313 వినతులు వచ్చాయి. భూసంబంధ సమస్యలపై రెవెన్యూ క్లినిక్‌కు వచ్చిన అర్జీలే 143 ఉండగా పీజీఆర్ఎస్‌కు వచ్చినవి 170 ఉన్నాయి. కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇన్‌ఛార్జి ఆర్డీవోలు ఫిర్యాదులు స్వీకరించారు.

## కార్యాచరణకు ప్రణాళిక.. రీచ్‌లలో థర్మల్ డ్రోన్లతో గస్తీ



**రాజమహేంద్రవరం:** అధికారుల పర్యవేక్షణ లేమి, తెరచాటున కొందరు నాయకుల సహకారం వెరసి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడంలేదు. బోట్స్‌మన్ సొసైటీ పేరుతో రాజమహేంద్రవరం గ్రామీణం, నగరం, కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో అడ్డగోలుగా డ్రెడ్జింగ్ జరుగుతోంది. అసలు గోదావరిలోకి డ్రెడ్జర్లు ఎక్కడి నుంచి వచ్చాయి? అనుమతి లేకుండా ఎందుకు తిరుగుతున్నాయన్న అంశంపై జలవనరులశాఖ, జిల్లా యంత్రాంగం దృష్టి సారించడంలేదు. వీటిని అరికట్టడానికి ఏఐ (కృత్రిమ మేధరి) సీసీ కెమెరాలు, థర్మల్ డ్రోన్లు వినియోగించాలని నిర్ణయించారు.

**వాహనం నంబరు, రవాణా వివరాలతో..**

గతంలో ఇసుక రీచ్‌లలో సాధారణ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా పర్యవేక్షణ లేకపోవడం, అందులో డేటాను సమీక్షించకుండా వదిలేయడంతో ఎన్ని వాహనాలు బయటకు వెళ్లాయి? అందులో అక్రమంగా తిరిగినవి ఎన్ననే సమాచారం వెల్లడయ్యేది కాదు. ఇప్పుడు వాటి స్థానంలో రీచ్‌ల వద్ద ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తారు. అందులో వాహనం నంబరు, ఎన్ని టన్నులు రవాణా అవుతుందో నమోదు చేసి కమాండ్ కంట్రోల్ కేంద్రానికి చేర్చేలా ఏర్పాటుచేస్తున్నారు. తద్వారా అక్రమార్కులను సులభంగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

రాత్రి వేళ నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్, రీచ్‌లలో తవ్వకాలు జరగుతున్న నేపథ్యంలో థర్మల్‌డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహించాలని యోచిస్తున్నారు. ఇప్పటికే ఓ సంస్థ నమూనా రన్ నిర్వహించగా, మరో సంస్థ సైతం ఆసక్తి చూపుతోంది.

**సగటున 15 వేల మెట్రిక్ టన్నుల సరఫరా**

జిల్లాలో 9 ఓపెన్ రీచ్‌లు, 25 వరకు బోట్స్‌మన్ సొసైటీలు, పట్టా భూముల్లో 10 చోట్ల ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తరలుతోందని అధికార వర్గాలు చెబుతున్నా.. అంతకుమించే అక్రమంగా వెళ్తునట్లు అంచనా.

**440 కేసులు.. రూ.91.39 లక్షల జరిమానా**

ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 440 కేసులు నమోదు చేశారు. రూ.91.39 లక్షల అపరాధరుసుము వసూలు చేశారు. తెలంగాణకు ఇసుక తరలినా గుర్తించలేకపోయారు. అధిక లోడు ఉల్లంఘనపై కేవలం 70 కేసులు నమోదు చేశారంటే అధికారుల పర్యవేక్షణ లేమి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

## మరుగుదొడ్ల పేరిట నిధుల మేత!



**అంబాజీపేట:** ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసుతో గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. అంబాజీపేట ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. మాచవరం గ్రామానికి చెందిన ర్యాలి సత్యనారాయణ ఇంట్లో అతని అత్తయ్య దేవగుప్తపు లక్ష్మి నివాసం ఉంటున్నారు. శనివారం తెల్లవారు జామున ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె తలపై గాయపరిచాడు. అనంతరం లక్ష్మి మెడలో ఉన్న 9 గ్రాముల బంగారు గొలుసుతో పరారయ్యాడు. సమీపంలో నివాసముంటున్న అతని అల్లుడు సత్యనారాయణకు జరిగిన సంఘటనను లక్ష్మి వివరించింది. దాంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై కె.చిరంజీవిలు పరిశీలించారు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## డ్రైవింగ్ లైసెన్సులో.. చిరునామా మార్చుకోండిలా..




**అమలాపురం గ్రామీణం:** డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లో చిరునామా మార్పు చాలా మందికి అవసరం అవుతుంటుంది. వివిధ అవసరాల వల్ల ఇతర ప్రాంతాల్లో ఉంటూ అక్కడ డీఎల్ పొందిన వారు.. తర్వాత చిరునామా మారితే ఆ మేరకు మార్చుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారి కోసం కేంద్ర రవాణాశాఖ సేవలను సులభతరం చేసింది.

**ఎలా నమోదు చేసుకోవాలి**

ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సుతోపాటు ప్రస్తుతం ఉంటున్న చిరునామా ధ్రువపత్రాలు (ఆధార్, ఓటర్ ఐడీ, విద్యుత్తు, గ్యాస్ బిల్లులు) అవసరం. వయసు 40 ఏళ్లు దాటితే తప్పనిసరిగా వైద్యుల ధ్రువీకరణ పత్రం(ఫారం-1ఎ) తప్పనిసరి. ముందుగా కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ parivahan.go.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.ఆన్‌లైన్ సర్వీసెస్‌లోకి వెళ్లి డ్రైవింగ్ లైసెన్సు రిలేటెడ్ సర్వీసెస్‌లో ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవాలి. అనంతరం అప్డై ఛేంజ్ ఆఫ్ అడ్రస్‌లోకి వెళ్లాక.. డీఎల్ నంబరు, పుట్టిన తేదీ పొందుపర్చాలి. గెట్ డీఎల్ డీటెయిల్స్‌ని ఎంచుకోవాలి. ఛేంజ్ ఆఫ్ అడ్రస్ ఆప్షన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా నమోదు చేయాలి. దరఖాస్తు సబ్మిట్ చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో నిర్ణీత రుసుం చెల్లించాలి. అనంతరం దగ్గర్లోని ఆర్టీవో కార్యాలయంలో ధ్రువపత్రాలు పరిశీలనకు స్లాట్(తేదీ) బుక్ చేసుకోవాలి. ఆర్టీవో కార్యాలయానికి వెళ్లినప్పుడు సంబంధిత ఒరిజినల్ పత్రాలను తీసుకెళ్తే వాటిని చూసిన అధికారులు ఆమోదిస్తారు. అనంతరం ప్రస్తుత చిరునామాతో ఉండే స్మార్ట్ కార్డు పోస్టు ద్వారా ఇంటికి వస్తుంది.

## భర్తపై దాడి చేయాలని ప్రియుడికి కత్తి అందించిన భార్య



**రంగంపేట:** రంగంపేట మండలం దొడ్డిగుంటకు చెందిన వ్యవసాయ కూలీ బక్కా నాగేంద్ర (33)ను హతమార్చిన కేసులో అతని భార్య వీరలక్ష్మి, ఆమె ప్రియుడు శివను అరెస్టు చేసినట్లు రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ప్రియుడితో కలిసి భార్య అతన్ని హత్యచేసినట్లు విచారణలో వెల్లడైందని వివరించారు. సోమవారం రంగంపేట పోలీసుస్టేషన్‌లో కేసు వివరాలను ఆమె విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దొడ్డిగుంటకు చెందిన నాగేంద్ర, వీరలక్ష్మి ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా వీరికి అయిదేళ్ల కుమార్తె ఉంది. వీరలక్ష్మికి నల్లమల్లికి చెందిన తోరాట శివతో పరిచయం పెరిగి క్రమంగా వివాహేతర సంబంధం వరకు దారితీసింది. ఈ విషయం తెలిసి భర్త ఆమెను దూరంగా పెట్టారు. ఈ నేపథ్యంలో గత నెల 27వ తేదీన అర్ధరాత్రి దాటాక వారిద్దరూ కలిసి ఉన్న విషయం తెలుసుకున్న నాగేంద్ర నిలదీశాడు. అదే సమయంలో అతడిని హతమార్చాలని నిర్ణయించుకున్న ఆమె ప్రియుడు శివకు కత్తి అందించగా అతను దాడికి ప్రయత్నించినపుడు జరిగిన కొట్లాటలో నాగేంద్ర ప్రాణాలు కోల్పోయారు. నిందితుడు శివకు గాయాలు కావడంతో అనపర్తి ఆసుపత్రిలో చేరాడు. చికిత్సతో కోలుకున్న తర్వాత ఆసుపత్రి నుంచి శివ, వీరలక్ష్మి పరారయ్యే ప్రయత్నంలో ఉండగా సీఐ సుమంత్‌కు అందిన సమాచారంతో అప్రమత్తమై వారిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ చెప్పారు.

**ఎస్సైపై డీఎస్పీకి ఫిర్యాదు..**

ఈ కేసు విషయంలో ఎస్సై శివప్రసాద్‌కు ఫిర్యాదుచేసినా ఆయన సరిగా స్పందించలేదని బీసీ సంఘాలు నాయకులు ఇటీవల డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాజాగా రాజమహేంద్రవరంలో డీఎస్పీ విద్యను కలిసి ముకుందవరంలోని రామాలయంలో విగ్రహాల చోరీ విషయాన్ని గోప్యంగా ఉంచారని గ్రామస్థులు ఫిర్యాదుచేశారు. నిందితులు దొరికినా వారికి ఎస్సై మద్దతుగా నిలిచారని ఆరోపించారు. దొడ్డిగుంట హత్య కేసులో ఎస్సైపై అందిన ఫిర్యాదు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని డీఎస్పీ చెప్పారు.

## వేంకటేశ్వర స్వామి రథోత్సవం



**యానాం :** యానాం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. మీసాల వెంకన్న తీర్థంగా ప్రఖ్యాతి పొందిన ఈ వేడుకలో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్త బస్టాండ్ వద్ద రథంలో కొలువుదీరిన స్వామి వారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

# గోదావరి జిల్లాల సమాచారం

## ప్రభుత్వ నిర్ణయంతో గర్భిణులకు మేలు



**మసీదుసెంటర్(కాకినాడ),:** జిల్లాలో అధిక సంఖ్యలో గర్భిణులు అవగాహన కొరవడి రక్తహీనతతో బాధపడుతున్నారు. తగినంత పోషకాహారం తీసుకోకపోవడంతో ఎక్కువ మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. గర్భం వచ్చిందని తెలియగానే ఆసుపత్రులకు వెళ్లకుండా ఉండడం.. అయిదు, ఆరు నెలలు వచ్చేవరకూ అశ్రద్ధ చేయడంతో రక్తహీనతకు గురవుతున్నట్లు వైద్యుల పరిశీలనలో తేలింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ రక్తం తక్కువగా ఉండే బాలింతలకు మాత్రమే ఇచ్చే ఫెర్రిక్ కార్బాక్సీ మల్టోస్ (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్‌ను ఇక నుంచి గర్భిణులకు ఇవ్వాలని నిర్ణయించింది. ఏటా జిల్లాలో సుమారు 20 వేలకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో సగానికి పైగా రక్తహీన బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణులకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం అందిస్తోంది. పలు కారణాలతో చాలామంది వీటిని సద్వినియోగం చేసుకోవడం లేదు. ఫలితంగా రక్తహీనత బారిన పడుతున్నారు. దీంతో ప్రసవ సమయంలో తల్లి, బిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ప్రసవం అయ్యాక రక్తం చాలా తక్కువగా ఉన్నవారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐరన్, సూక్రోజ్ సూదిమందు వేసేవారు.

**ఎఫ్‌సీఎం ఇంజక్షన్ ధర ఇలా..**

ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ ధర మార్కెట్‌లో సుమారు రూ.1500 ఉండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.2,000కు పైగా వసూలు చేస్తున్నారు. ఒకటి, రెండుసార్లు ఆ ఇంజెక్షన్ చేయించుకుంటే రక్తహీనత సమస్య ఉండదు.

అందుబాటులో ఉన్నాయి..జిల్లాలో జీజీహెచ్, సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన గర్భిణులు వెళ్లి ఉచితంగా పొందవచ్చు. అలాగే పీహెచ్‌సీల్లో ఐరన్, సూక్రోజ్ సూదిమందు వేస్తున్నారు. తద్వారా గర్భిణులకు రక్తహీనత లేకుండా చూస్తున్నాం. జిల్లాలో మాతృమరణాలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం.

## వేట్లపాలెం బాధిత కుటుంబాల్లో తీరని వేదన



**కాకినాడ:** ఘోర ప్రమాదం ఆ ఊరంతటిని విషాదంలోకి నెట్టింది. బతుకుతెరువు కోసం ఉపాధి మార్గంగా ఎంచుకున్న వృత్తి జీవితాలనే బుగ్గి చేసింది. 22 మందిని బాణసంచా తయారీ కేంద్రం పొట్టనపెట్టుకుంది. మరో ఏడుగురు ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి చనిపోయినవారిలో ఈ గ్రామానికే చెందినవారే 15 మంది ఉన్నారు. ఆదివారం ఏ ఇల్లు చూసినా తీవ్ర రోదనలే. బరువెక్కిన హృదయాలతో మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తిచేశారు. కాలి బూడిదైన బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు అవే చివరి మాటలు మా పిల్లలు దివ్యాంగులు. వారి మానసిక పరిస్థితి బాగుండదు. ఎంత పనిలో ఉన్నా పిల్లలు భోజనం చేశారా లేదా అని ఫోన్‌చేసి అడుగుతుంటారు నా భర్త పెదలోవరోజు. శనివారం నాకు ఫోన్ చేయలేదు. బంధువులు వచ్చి మందు కొట్టు పేలిపోయింది లోవరాజుని ఆసుపత్రిలో చేర్చారని చెప్పడంతో గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. ఆదివారం తెల్లవారుజామున ఆయన చనిపోయారని విలపించారు సామర్లకోటకు చెందిన దర్శిపాటి వెంకటలక్ష్మి. మృతిచెందిన గొడతా నాని పిల్లలను ఎత్తుకొని ఓదార్చుతున్న మంత్రి నారాయణ, ఎంపీ సానా సతీష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**వాహనాల్లో తరలించి..**

బాణసంచా పేలుడులో చనిపోయిన వారికి శనివారం రాత్రంతా శవపంచనామా పూర్తిచేశారు. ఇద్దరు ఆర్డీవోల పర్యవేక్షణలో తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మృతదేహాలను ఆదివారం ఉదయం మహాప్రస్థానం వాహనాల్లో వరుసగా గ్రామానికి పంపించి బంధువులకు అప్పగించారు. ఒకే ప్రాంతంలో ఆరు నుంచి ఎనిమిది మందికి వారి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిగాయి.

అమ్మా పనికి వెళుతున్నా.. నాన్నా పనిచూసుకొని వేగంగా వచ్చేస్తా అంటూ ఉదయం వెళ్లినవారు మధ్యాహ్నానికే మంటల్లో సజీవ దహనమైపోయారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోయినవారు కొందరు.. బిడ్డలను పోగొట్టుకున్నవారు ఇంకొందరు.. ఆఖరి చూపునకు కూడా నోచుకోలేకపోయామని ఆయా కుటుంబాలు అంతులేని ఆవేదన చెందుతున్నాయి. సామర్లకోటకు చెందిన ఏడిద సంపత్‌కుమార్(25) ఆరోగ్యం బాగాలేకపోవడంతో మూడు రోజులు పనిలోకి వెళ్లలేదు. ఇంటి పోషణ కష్టతరంగా ఉండడంతో శనివారం వెళ్లాడు. మధ్యాహ్నం 1.30



సమయంలో ఫోన్ చేసి పిల్లలు భోజనం చేశారా అని అడిగాడు. అవే ఆఖరి మాటలని భార్య శ్రావణి విలపించారు. బాబు, పాపతో బతికేదెలా అంటూ ఆవేదన చెందారు. సామర్లకోటకు చెందిన దర్శిపాటి యోహన్ (నాని)(38) ఫైర్ వర్క్సలో గత ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. భార్య గంగాభవానీ, ఇద్దరు కుమార్తెలు మానస, అఖిల ఉన్నారు. చిన్న బిడ్డకు ఆరోగ్యం బాగోలేదని ఎక్స్‌రే రిపోర్టు వాట్సాప్‌లో పంపాను.. చూడమని ఫోన్‌చేసి మాట్లాడాడు. అవే చివరి మాటలంటూ బోరున విలపిస్తోంది నాని తల్లి మరియమ్మ.

## దిగజారుతున్న గాలి నాణ్యత..




**రాజమహేంద్రవరం, టి.నగర్ :** చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో కాలుష్య తీవ్రత నానాటికీ తీవ్రమవుతోంది. గాలి నాణ్యత అత్యంత నాసిరకంగా ఉందని జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అయిదేళ్ల కిందట పోల్చితే కాలుష్య తీవ్రత రెట్టింపైంది. ప్రస్తుతం నగరంలో గాలి పీల్చడం ద్వారా రోజుకు సగటున 3.4 సిగరెట్లు తాగితే ఆరోగ్యంపై ఎంత ప్రభావం చూపుతుందో.. ఆ స్థాయిలో కాలుష్య తీవ్రత ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ స్థాయి 50 (పీఎం) నుంచి 150 పాయింట్ల మధ్య ఉంటే అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం**

కాలుష్య గాలి వల్ల ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, చర్మ వ్యాధులు, సైనస్ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరంలో ధూళి కణాల తీవ్రత సైతం అధికంగానే ఉంటోంది. దీన్ని నియంత్రించేందుకు నగరపాలక సంస్థ అప్పుడప్పుడూ గాలిలో రసాయనాలు పిచికారీ చేయిస్తున్నా, వాయు కాలుష్యం నియంత్రణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేకువ జామునే తీవ్రత

గాలి నాణ్యత 50 ఉంచి 150 పాయింట్ల మధ్య ఉంటే నాణ్యతలేమి (పూర్)ని, 200 పాయింట్ల స్థాయికి చేరితే అనారోగ్యహేతువును స్పష్టం చేస్తోంది.

ఆదివారం గణాంకాలు పరిశీలిస్తే కాలుష్య తీవ్రత (పాయింట్లలో)

వేకువజామున 5.00 గంటలకు గరిష్ఠంగా : 220

ఉదయం 7.00 గంటలకు : 210

సాయంత్రం 4 గంటలకు : 140

రాత్రి 8 గంటలకు : 180

డిసెంబరు 2025లో గరిష్ఠంగా 224 పీఎంతో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యత నమోదైంది. 2022 ఆగస్టులో 31 పీఎంతో తక్కువ స్థాయిలో నమోదైంది.

సంవత్సరం: పాయింట్లు

# కోస్టల్ రెగ్యులేటరీ జోన్ నిబంధనల్ని తగ్గించేందుకు పన్నాగాలు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** సుదీర్ఘమైన తీరప్రాంతంపై చంద్రబాబు ప్రభుత్వం పగబట్టింది. అనుయాయులకు లబ్ధి చేకూర్చేందుకు అభివృద్ధి పేరుతో తీరాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నుతోంది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలను సడలించడం, జోన్లు మార్చడం వంటి చర్యలతో తీరప్రాంత సమతుల్యతను దెబ్బతీస్తోంది. పర్యాటక ముసుగులో న్యాయస్థానాల హెచ్చరికల్ని కూడా బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. కావాల్సిన వారికి ప్రాజెక్టులను కట్టబెట్టేందుకు అడ్డదారులు తొక్కుతోంది. గతంలో పర్యావరణవేత్తలు, ప్రజలు పోరాడి కాపాడుకున్న తీరప్రాంతాలను ఇప్పుడు కమర్షియల్ హబ్‌లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నగరంలోని సాగరతీర ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తే ప్రభుత్వం ఎంతటి మొండివైఖరితో ఉందో అర్థమవుతోంది. తన వర్గాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, బడా కాంట్రాక్టర్ల కోసం పర్యావరణ అనుమతులను సైతం వేగవంతం చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యంతరాలను పక్కనపెట్టి అడ్జస్ట్‌మెంట్లతో ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తున్నారు.

**భీమిలి తీరంలో సీఆర్‌జెడ్ మాయాజాలం**

విశాఖ భీమిలి తీరప్రాంతంలో సీఆర్‌జెడ్ జోన్ల మార్పిడి (రీక్లాసిఫికేషన్)పై చంద్రబాబు ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. సీఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం.. సీఆర్‌జెడ్ 3 కేటగిరీలో ఉన్న ప్రాంతాలు తక్కువ నిర్మాణాలు కలిగి, ప్రకృతి సిద్ధంగా ఉంటాయి. సముద్రమట్టం నుంచి 200 మీటర్ల వరకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. ఇక్కడి ఇసుకదిబ్బలు, చిత్తడినేలలు వంటివి అలల తాకిడిని, తుపాన్లను అడ్డుకునే సహజ రక్షణ కవచాలుగా పనిచేస్తాయి. సీఆర్‌జెడ్ 2 కేటగిరీలో సముద్రతీరానికి అత్యంత సమీపంలో భారీ కాంక్రీట్ కట్టడాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించుకోవచ్చు. విశాఖ భీమిలి బీచ్ వెంబడి సీఆర్‌జెడ్ 3 పరిధిలో 500 ఎకరాలకుపైగా భూములున్నాయి. వీటిలో భారీ కాంక్రీట్ నిర్మాణాలకు వీలులేదు. ఇప్పుడు ఈ భూముల్ని సీఆర్‌జెడ్ 2 పరిధిలోకి తీసుకొచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ భూముల్లో మెజారిటీ వాటా ప్రభుత్వ నేతలదే కావడంతో.. మార్పిడి ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. విశాఖని గ్లోబల్ సిటీగా మారుస్తామనే సాకుతో తీరప్రాంత మాస్టర్‌ప్లాన్‌పై సమీక్షలు మొదలుపెట్టారు. 2024 అక్టోబర్ డిసెంబర్ మధ్య మాస్టర్‌ప్లాన్ సవరణల పేరుతో అంతర్గత కసరత్తు జరిగింది. ఆ సమయంలోనే సీఆర్‌జెడ్ 3లోని భూముల్ని సీఆర్‌జెడ్ 2 కిందకు చేర్చి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలుగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపించి మార్పులు చేసెయ్యాలని ప్రభుత్వం ఆరాటపడిపోతోంది.

పర్యావరణ నిబంధనలు అభివృద్ధికి అడ్డంకి అన్న మంత్రి దుర్గేష్ నిబంధనల్ని పాటిస్తూ పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు.. ఇప్పుడు అభివృద్ధికి అవే అడ్డంకి అనటం ఆందోళన కలిగిస్తోంది. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ శాసనసభలో మాట్లాడుతూ పర్యావరణ నిబంధనలు అభివృద్ధికి అడ్డంకి అంటూ వ్యాఖ్యానించారు. ఇక విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి కూడా అసెంబ్లీలో నియోజకవర్గంలోని సమస్యలు, అభివృద్ధి కోసం కాకుండా.. బీచ్‌రోడ్డుని సీఆర్‌జెడ్ 2లోకి తీసుకురావాలని కోరారు.

**పర్యావరణ కంటే.. ప్రాఫిట్ ముఖ్యం**

వీటిని పరిశీలిస్తే ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కంటే ప్రాఫిట్‌కే పెద్దపీట వేస్తోందని స్పష్టమవుతోంది. ఈ తరహా నిర్ణయాలు తీసుకుంటే.. నగరంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. తీరంలో ఇసుక దిబ్బలు, ఖాళీ ప్రదేశాలు సహజ సిద్ధమైన బఫర్ జోన్లుగా పనిచేసి ఉప్పెనలు, తుపాన్ల తీవ్రతను తగ్గిస్తాయి. ఇప్పుడు ఆ ప్రాంతాల్లో వాణిజ్య విస్తరణకు తెరతీస్తే.. భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలకు విశాఖను బలి చేయడమేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వం విశాఖ విధ్వంసాన్ని మాత్రమే కోరుకుంటోంది తప్ప.. అభివృద్ధిని కాదంటూ పర్యావరణవేత్తలు, కూటమి పార్టీల ప్రతినిధులే సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తిపోస్తున్నారు.

**ఆత్మహత్యా సదృశ్యమే..**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ముప్పు పొంచి ఉన్న తరుణంలో ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఓవైపు గ్రేట్ గ్రీన్‌వాల్ వంటి కార్యక్రమాలు చేస్తూనే.. మరోవైపు పర్యాటకశాఖ దానికి విరుద్ధంగా వ్యవహరించడం శోచనీయం. కేవలం రూ.4,098 కోట్ల పెట్టుబడులు, 2,800 హోటల్ గదులు వంటి తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం, శాశ్వత పర్యావరణ రక్షణ కవచాలైన సీఆర్‌జెడ్ 3 నిబంధనలను సడలించి తీరాన్ని కాంక్రీట్ జంగిల్‌గా మార్చాలని చూడటం ఆత్మహత్యా సదృశ్యమే. ఇప్పటికే జీవీఎంసీ, ఏపీపీసీబీ పర్యవేక్షణ లోపంతో సముద్రజలాలు కలుషితమవుతున్నాయి. ఇప్పుడు అదనపు కట్టడాలకు అనుమతినిస్తే విశాఖ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది. అభివృద్ధి అంటే ప్రకృతిని ధ్వంసం చేయడంకాదు, భావితరాలకు సురక్షితమైన తీరాన్ని అందించడమే. ప్రభుత్వం సీఆర్‌జెడ్ పునర్వర్గీకరణ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి. బొలిశెట్టి సత్యనారాయణ, జనసేన ప్రతినిధి, పర్యావరణవేత్త

**తుపాన్లు, ఉప్పెన్ల ముప్పు పెరుగుతుంది**

విశాఖపట్నం తీరప్రాంతంలో సీఆర్‌జెడ్ 3 నిబంధనలను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుండటం గర్హనీయం. కేవలం పర్యాటక అభివృద్ధి, వాణిజ్య విస్తరణ పేరుతో చేస్తున్న ఈ మార్పువల్ల సాగరతీరంలోని ఇసుక దిబ్బలు, చిత్తడి నేలలు వంటి సహజ రక్షణ కవచాలు ధ్వంసమైపోతాయి. భవిష్యత్తులో తుపాన్లు, ఉప్పెన్ల ముప్పు పెరుగుతుంది. ప్రభుత్వం తాత్కాలిక లాభాల కోసం మత్స్యకారుల జీవనోపాధిని పణంగా పెడుతోంది. ఇప్పటికే కాలుష్యంతో అల్లాడుతున్న విశాఖకు ఇది మరో పెద్దదెబ్బ. చట్టబద్ధమైన పర్యావరణ రక్షణలను అడ్డంకులుగా చూడటం బాధ్యతారాహిత్యం. చంద్రబాబు ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాల్సిందే.

# మిల్క్ యాక్ట్ ఉన్నా పట్టించుకోని పశుశాఖ మిల్క్ ఇన్‌స్పెక్టర్లు



**అనంతపురం అగ్రికల్చర్:** పాల కల్తీ ప్రాణాలు హరిస్తోంది. ఇది వరకు పాలల్లో నీళ్లు మాత్రమే కలిపేవారు. ఇప్పుడు కొందరు అత్యాశకు పోయి నీళ్లతో పాటు రంగు, రుచి, చిక్కదనం కోసం యూరియా, ఫార్మలిన్, హైడ్రోజన్ పెరాక్సైడ్, మాల్టోడెక్స్‌ట్రిన్, డిటర్జెంట్స్ లాంటి రకరకాల ప్రమాదకర రసాయనాలు, హానికరమైన పదార్థాలు కలిపి పాల అమ్మకాలు చేస్తున్నారు. ఇలాంటి పాల కల్తీ దందా గుట్టును ఏడాది కిందటే అనంతపురం జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేసిన విషయం తెలిసిందే. పాలలో హానికరమైన 'మాల్టోడెక్స్‌ట్రిన్' కలుపుతున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించి అప్రమత్తం చేశారు. తాజాగా రాజమండ్రిలో కల్తీపాలు తాగి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటన సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తోంది.

**పశు శాఖ అధికారుల నిర్లక్ష్యం..**

పాలు ఉత్పత్తి, క్రయ విక్రయాలు, కల్తీ, నాసిరకం అనే అంశాలు తమకు సంబంధం లేదన్నట్లుగా పశు సంవర్ధక శాఖ అధికారులు మౌనం పాటిస్తున్నారు. పశువైద్యం, పశుసంతతి పెంపు, పథకాల అమలు వరకే తమ పని అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం జిల్లాలో రోజుకు ఎన్ని లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది, అందులో ప్రైవేట్ డెయిరీలు ఎన్ని సేకరిస్తున్నాయి, బయట వ్యాపారులు ఎన్ని లీటర్లు అమ్ముతున్నారు, ఇతరత్రా రూపాల్లో సాగిస్తున్న అమ్మకాల వివరాలు చెప్పడానికి కూడా నిరాకరిస్తున్నారు. రోజుకు 5 లక్షల లీటర్లు అని ఒక అధికారి, లేదు లేదు 8 నుంచి 10 లక్షల లీటర్లు ఉత్పత్తి అంటూ మరో అధికారి, అదీ కాదు... 13 లక్షల లీటర్లకు పైగా పాల ఉత్పత్తి జరుగుతోందని ఇంకో అధికారి... ఇలా కచ్చితమైన లెక్క చెప్పే పరిస్థితి కనిపించడం లేదు.

**మిల్క్ యాక్ట్ ఏం చెబుతోందంటే..**

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నాసిరకం, కల్తీపాలను అరికట్టాలనే ఆలోచనతో 2023లో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాల రక్షిత ప్రమాణాల అమలు చట్టం (మిల్క్‌యాక్ట్)ను తెచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ డెయిరీలు, ఇతరత్రా పాల సేకరణ, అమ్మకాలు సాగించే దుకాణాలు, ప్రాంతాల్లో పాల నాణ్యత తెలుసుకునే అధికారం పశు సంవర్ధక శాఖ అధికారులకు అప్పగించారు. జిల్లాలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్స్ సర్జన్స్ (వీఏఎస్) అందరూ 'మిల్క్ ఇన్‌స్పెక్టర్లు'గా పనిచేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. మిల్క్‌యాక్ట్‌పై శిక్షణ కూడా ఇచ్చారు. మిల్క్ యాక్ట్ ప్రకారం పాల సేకరణ కేంద్రాలు (మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లు) తప్పనిసరిగా రూ.1,500 చెల్లించి లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. ఏటా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. తనిఖీకి వచ్చినప్పుడు లైసెన్సు లేకుంటే మొదటి దఫా కింద రూ.50 వేల జరిమానా, రెండోసారి కూడా పట్టుబడితే రూ. లక్ష జరిమానా, ఆరు నెలల వరకు జైలుశిక్ష కూడా ఉంటుంది. కల్తీ, నాసిరకమని తేలితే మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

**మిల్క్ ఇన్‌స్పెక్టర్ల నిర్లక్ష్యం..**

మిల్క్ ఇన్‌స్పెక్టర్లు తరచూ పాల సేకరణ కేంద్రాలను తనిఖీ చేయాలి. పాల నాణ్యత పెంచి.. నాసిరకం, కల్తీని నివారించాలని మిల్క్‌యాక్ట్ చెబుతోంది. కానీ మిల్క్ ఇన్‌స్పెక్టర్లు తమ బాధ్యతల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో 'కల్తీ' నిరాటంకంగా కొనసాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరం, పట్టణాలే కాదు.. ఇప్పుడు మారుమూల పల్లె ప్రాంతాల్లో కూడా 'కల్తీ' యథేచ్ఛగా సాగిస్తూ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

⇒ జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటే తప్ప నాణ్యమైన పాలు, వాటి ఉత్పత్తులు ప్రజలకు అందే పరిస్థితి ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాలు మాత్రమే కల్తీ అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పాల ద్వారా తయారయ్యే పెరుగు, మజ్జిగ, పాలపొడి, వెన్న, నెయ్యి, స్వీట్లు, ఐస్‌క్రీమ్, పన్నీర్, ఇతరత్రా బేకరీ ఉత్పత్తులు కూడా కల్తీ అయినట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీర్ణసమస్యలు, కిడ్నీ, కాలేయ సమస్యలు, పేగుల వాపు, గ్యాస్ట్రిక్, విరేచనాలు తదితర ఎన్నో అనారోగ్య సమస్యలు తప్పవని చెబుతున్నారు.

# ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా సిద్ధం

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రభుత్వ పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్, విద్యాశాఖ కార్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఇప్పటికే వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాబితా రూపొందించామని వెల్లడించారు. జాబితాపై అభ్యంతరాలను ఈనెల ఏడోతేదీలోగా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# కాటేసిన పాముతో ఆస్పత్రికి



**నెల్లూరు జిల్లా:** సాధారణంగా పాము కనిపిస్తేనే ఆమడ దూరం పరిగెడతాం. అలాంటిది తనను కాటేసిన పామును చంపి.. దాన్ని చేత్తో పట్టుకొని నేరుగా ఆస్పత్రికే వచ్చారో వ్యక్తి. కోవూరు ప్రభుత్వ వైద్యశాల సాక్షిగా ఈ వింత ఘటన చోటుచేసుకుంది. ఈ సాహసం చూసి రోగులు, ఆస్పత్రి సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కోవూరు పరిధిలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన వలీ పనుల్లో ఉండగా, ఓ పాము కాటేసింది. అయితే దాన్ని అక్కడికక్కడే చంపేశారు. ఏ పాము కరిచిందో తెలిస్తేనే వైద్యం కచ్చితంగా అందుతుందనే ఉద్దేశంతో నేరుగా దాంతో సహా కోవూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి ప్రాంగణంలోని వారంతా భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది వెంటనే స్పందించి చికిత్సను ప్రారంభించారు. ప్రస్తు తం వలీ పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం.

## సమాజ సంక్షేమం కోసం శ్రీశైలంలో సత్యసాయి సేవా దళ్ రుద్రపారాయణం





**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రస్తుత సమాజంలోని పరిస్థితులు,మానవుని లోపల బయట యుద్ధ వాతావరణం నెలకొన్న స్థితిలో సత్యసాయి భక్తులు ఐదువేలమంది శ్రీశైలంలో సోమవారం రుద్రం పారాయణం చేసారు.వారిలో ఇతర రాష్ట్రాల వారు,విదేశీయులు ఉండడం విశేషం.వీరంతా ఏక కంఠంతో రుద్రం చదువుతుంటే వారు శివుని ప్రథమ గణాలా అనిపించింది.నాలుగు గంటలపాటు జరిగిన పారాయణాన్ని మిగిలిన భక్తులు తన్మయత్వంతో తిలకించడం విశేషం.సమాజ శ్రేయస్సు కోసం రుద్రం చేయడం మంచిదని,చెడు తొలగిపోతుందని స్వామి చెప్పేవారు. ఈ పారాయణం సత్యసాయి సంస్థల పదాధికారులు,సేవాదళ్ సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు.

# ఇస్రో ప్రయోగాలకు 3 నెలల పాటు బ్రేక్!



**శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపొందించిన పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగాల్లో..ఒకే రకమైన సాంకేతిక లోపంతో రెండు ప్రయోగాలు విఫలం కావడంతో 3 నెలల పాటు ప్రయోగాలకు ఇస్రో బ్రేక్ వేసింది. గతేడాది మే నెలలో పీఎస్ఎల్‌వీ సీ61, ఈ ఏడాది జనవరిలో పీఎస్ఎల్‌వీ సీ62 రాకెట్‌లు విఫలమైన తరువాత మళ్లీ ప్రయోగాల జోలికి పోలేదు. ఈ రెండు రాకెట్లు ఒకే తరహా సాంకేతికపరమైన లోపంతో విఫలమయ్యాయి. పీఎస్ఎల్‌వీ సీ61 ప్రయోగం విఫలమైనప్పుడు శాస్త్రవేత్తలు ఏమరుపాటుగానే ఉండిపోయారు. అదే తరహాలోనే మరో ప్రయోగం కూడా విఫలం కావడంతో కేంద్రం తీవ్రంగా పరిగణించి విచారణ కమిటీని నియమించింది.

ఈ కమిటీ ఇటీవల శ్రీహరికోటలో విచారణ జరిపింది. రెండు రాకెట్లకు మూడో దశలోనే సాంకేతిక లోపం తలెత్తింది. మూడో దశ అంటే ఘన ఇంధన దశ. ఘన ఇంధన మోటార్‌లు షార్ కేంద్రంలోనే తయారు చేస్తారు. అందుకే ఈ కమిటీ సాలిడ్ మోటార్ దశలోనే ఎందుకు ఇబ్బంది వచ్చిందనే దానిపై తనిఖీలు చేపట్టి దానికి సంబంధించిన ఇంజినీర్లను విచారించింది. ఇలా అన్ని సెంటర్లకు కమిటీ వెళ్లి విచారిస్తుంది. దీంతో 3 నెలల పాటు ప్రయోగాలు ఉండకపోవచ్చునని షార్ వర్గాల సమాచారం. దీంతో ఈ ఏడాది అనుకున్న గగన్‌యాన్ ప్రాజెక్టు ప్రయోగాలు కూడా ఆలస్యమయ్యే అవకాశముంది. చంద్రయాన్‌ఉ4 ప్రయోగం కూడా కొంత ఆలస్యం కావచ్చనే చర్చ ఇస్రో వర్గాల్లో నడుస్తోంది.

# నగల కోసం వృద్ధురాలి హత్య




**తిరుపతి:** నగల కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన ఘటన కలకలం రేపింది. నగరంలోని అరవపల్లె వీధిలో నివాసం ఉంటున్న కె.లక్ష్మమ్మ (67) టీటీడీలో పనిచేసి రిటైరయ్యారు. సోమవారం ఉదయం ఆమె మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం రాత్రి లక్ష్మమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుండగులు ఆమె గొంతు నులిమి, అనంతరం దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. అనంతరం ఆమె వద్ద ఉన్న 100 గ్రాములకుపైగా బంగారు నగలను దోచుకెళ్లినట్లు తెలుస్తోంది. వెస్ట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తోంది. మృతురాలి చిన్న కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో మృతురాలి సొంత మనవడి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఘనంగా మహిళా కార్యదర్శి శ్రీమతి గణగళ్ల సత్య పుట్టినరోజు వేడుకలు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** పుట్టినరోజు జరుపుకుంటున్న విశాఖ పార్లమెంట్ మహిళా కార్యదర్శి శ్రీమతి గణగళ్ల సత్య గారు విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు శ్రీ. చోడే పట్టాభి రామ్ గారు, విశాఖ జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శ్రీ. లోడగల కృష్ణ గారు, జిల్లా ఉపాధ్యక్షులు కోట నరేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొల్లి ఏడుకొండలు, కోయిలడా వెంకటేష్ గారు,పైడవాడ శ్రీనివాస్,లీలావతి, శివ చౌదరి గారు, మరియు ఆఫీస్ మేనేజర్ రాజశేఖర్ గార్ల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది.

# ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్యం పెన్షన్ అందక తీవ్ర ఇబ్బంది పడుతున్న వృద్ధాప్యంలో




**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతపురం మండలం. ఎగువ శోభ క్రమపంచాయతీ పరిధిలో గల పూలుగుడ గ్రామం వృద్ధాప్యంలో ఉన్న గిరిజనుడు గిరిజన మహిళ ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న ఓ గిరిజన వృద్ధుడు. గిరిజన వృద్ధురాలు గత పది ఏళ్ల బట్టి వృద్ధాప్యం పెన్షన్ అందక ప్రభుత్వం వారు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మంజూరు కై ఎదురుచూస్తూన్నారు ఈ గిరిజన ఈ వృద్ధుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి 10 ఏళ్లగా పెన్షన్ మంజూరు కై ఎగువ శోభ గ్రామపంచాయతీ సచివాలయంలో దరఖాస్తులు పెట్టుతున్నప్పటికీ పెన్షన్ మంజూరు అవ్వక నిరోధసింతునట్లు వరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఏ నాయకుడు వచ్చినా తమకు పెన్షన్ మంజూరు చేయించాలని కోరుతున్నారు కానీ వారి గోడు ఏ నాయకుడు పట్టించు పోవడం లేదు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమకు వృద్ధాప్యం పెన్షన్ మంజూరు చేసి సహాయము అందించి ఆర్థిక సహాయం అందిస్తారని వేడుకుంటున్నారు

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫర్ చోద్యం చూస్తున్న విద్యుత్ శాఖ అధికారులు



**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. కొండిబా పంచాయితీకి చెందిన డము కు గ్రామంలో ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫారం ట్రాన్స్ఫర్ కి సంబంధించిన విద్యుత్ స్తంభాలు శిథిలం అయిపోయి పడిపోయే స్థితిలో ఉన్నాయి ఎన్నోమార్లు ఇంజనీరింగ్ అధికారికి తెలియపరిచినప్పటికీ ఇంతవరకు విద్యుత్ స్తంభాలు మార్పిడి చేయలేదు గ్రామం ఇలా మధ్యలో విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటుచేసి సంవత్సరాల తరబడి మరమ్మతుల్లోంచి ఒక ప్రమాదకరంగా మారి ఉండడంతో ఏ క్షణం లో ఎవరి ఇంటి మీద పడిపోద్దని గ్రామస్తులైన కిముడు పండన్న. కిలో వీరన్న. కిముడు చంద్రన్న. చట్టారి కొండలరావు తదితర గ్రామ గిరిజనులు భయాందోళన చెందుతున్నారు ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ ట్రాన్స్ఫారం విద్యుత్ స్తంభాలు మార్పిడి చేసి విద్యుత్ ట్రాన్స్ఫారం వల్ల ఇటువంటి ప్రమాదులు జరగకుండా చూడాలని స్థానిక గిరిజనులు కోరుచున్నారు

## ఎగువ శోభ పంచాయితీ అభ్యర్థిగా పాంగి సందీప్, (బాబి) ని ఎంపీటీసీ అభ్యర్థిగా పాంగి రవీంద్రను అధిష్టానం తీర్మానించింది



**అనంతగిరి విశాఖ సమాచారం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతరం మండలం. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో గ్రామపంచాయతీ సర్పంచ్ గా పాంగి సందీప్( బాబి )ను. ఎంపీటీసీ అభ్యర్థిగా పంది రవీంద్రను తెలుగుదేశం పార్టీ అరకు ఇన్చార్జి మరియు ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జాన్ చైర్మన్సియారిదొన్ను దొర తిర్మా నించడం జరిగిందని పుకార్లు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం కోసం మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహోరాత్రులు శ్రమించి కష్టపడి పనిచేస్తున్నారని అటువంటి తరుణంలో తెలుగుదేశం పార్టీని నమ్ముకొని కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా వారిని గుర్తించి పంచాయితీ సర్పంచ్ ఎంపీటీసీ అభ్యర్థులను బలపరుస్తున్నామని ఆయన అన్నారు పంచాయితీ ప్రజలకు తెలియ జేయడపేమనగా ప్రతి ఓటరు గమనించి ఆలోచించి ప్రజలకు అనుకూలంగా ఉండి ప్రజల మంచి చెడలు చూసుకునే నాయకుడిని ఎంచుకొని ఓట్లేసి గెలిపిస్తారని కోరడమైనది పార్టీ నిబంధనలకు కట్టుబడి క్రమశిక్షణతో పార్టీ కోసం పని చేస్తున్నా పాంగి సందీప్ ( బాబి )ని. ఎంపీటీసీ అభ్యర్థి పంది రవీంద్రను గెలిపిస్తారని పంచాయతీల ప్రజలకు జ్ఞాపకం చేస్తున్నాను ఇట్లుసియారి దొ న్ను దొర

# క్రీడా సినిమా సమాచారమ్

## స్టార్ హీరో భార్య నికర ఆస్తి విలువ 500 కోట్లు!



తమిళ సినీ పరిశ్రమలో తిరుగులేని మాస్ ఇమేజ్ కలిగిన దళపతి విజయ్ ఇటీవల రాజకీయ పార్టీ –తమిళగ వెట్రి కజగమ్– (టీవీకే) ని ప్రారంభించి రాజకీయాల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వ్యక్తిగత జీవితంపైనా.. ముఖ్యంగా ఆయన భార్య సంగీత సోర్నలింగం ఆస్తుల వివరాలపైనా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విజయ్ కంటే సంగీతకే ఎక్కువ ఆస్తులు ఉన్నాయనే వార్తలు నెటిజన్లను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సంగీత సోర్నలింగం లండన్‌లో స్థిరపడిన శ్రీలంక తమిళ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆమె తండ్రి సోర్నలింగం యూకేలో ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త. కుటుంబ నేపథ్యం పరంగా సంగీతకు భారీగా వారసత్వ ఆస్తులు ఉన్నాయని తెలుస్తోంది. తాజా కథనాల ప్రకారం.. శ్రీమతి సంగీత విజయ్ నికర ఆస్తి విలువ రూ.400 కోట్ల నుండి రూ.500 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. లండన్‌లో తన అమ్మ తరపు కుటుంబానికి ఉన్న స్థిరాస్తులు.. వ్యాపార పెట్టుబడుల ద్వారా ఈ స్థాయి సంపద చేకూరిందని సమాచారం. అయితే ఈ అంకెలకు సంబంధించి విజయ్ కుటుంబం నుండి ఎలాంటి అధికారిక ధృవీకరణ చేయలేదు. చెన్నైలో విజయ్ నివసించే ఖరీదైన భవంతుల గురించి కూడా ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. చెన్నైలోని నీలాంకరైలో ఉన్న అత్యాధునిక బీచ్ హౌస్ దాదాపు 70 కోట్ల నుండి 80 కోట్ల విలువ కలిగి ఉంటుంది. ఇది విజయ్ పేరు మీద ఉండగా.. ఆయనకు శ్రీలంకలో కూడా ఖరీదైన ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. సంగీత శ్రీలంక మూలాలు కలిగిన వ్యక్తి కావడంతో ఆ దేశంలో ఉన్న కొన్ని ప్రాపర్టీలు తన పేరు మీద లేదా ఉమ్మడి పేరు మీద ఉండవచ్చని సినీ వర్గాల్లో ప్రచారం ఉంది. విజయ్– సంగీత 1999 ఆగస్టు 25న వివాహం చేసుకున్నారు. ఒక వీరాభిమానిగా విజయ్‌ని కలవడానికి లండన్ నుండి వచ్చిన సంగీత ఆ తర్వాత ఆయన జీవిత భాగస్వామిగా మారడం ఒక సినిమా కథకు తక్కువేమీ కాదు. వీరికి కుమారుడు జేసన్ సంజయ్, కుమార్తె దివ్య సాషా ఉన్నారు. సంగీత సాధారణంగా మీడియాకు దూరంగా చాలా ప్రైవేట్‌గా ఉండటానికి ఇష్టపడతారు. కానీ విజయ్ రాజకీయ రంగ ప్రవేశం, ఇటీవల వస్తున్న విడాకుల పుకార్ల నేపథ్యంలో ఆమె పేరు మళ్ళీ తెరపైకి వచ్చింది. ˆూశ్రీంశీ =ముఃస – 'విష్ణు విన్యాసం' లీక్.. ఏం జరిగిందో చెప్పిన హీరో, ప్రొడ్యూసర్ ప్రస్తుతం వీరిద్దరి మధ్య వివాదాలు నడుస్తున్నాయని.. సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారని వస్తున్న వార్తలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. నీలాంకరైలోని ఇంట్లో నివసించే హక్కు కోసం ఆమె కోర్టును కోరినట్లు కూడా కొన్ని కథనాలు వెలువడ్డాయి. తాజాగా తమ వ్యక్తిగత కుటుంబ విషయాలు ఇతరులకు అనవసరం అని విజయ్ తరపున టీవీకే పార్టీ అధికారిక నోట్ రిలీజ్ చేసింది. విజయ్ మాత్రం ఇంకా దీనిపై స్పందించలేదు. విజయ్ తన రాజకీయ లక్ష్యాల వైపు దూసుకుపోతుండగా.. సంగీత లండన్‌లో తన కుటుంబ వ్యాపారాలను పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. సీఎం అవ్వాల్సిన విజయ్ కి వరుసగా ఊహించని ఝలక్ లు తగులుతుండటం ఆశ్చర్యపరుస్తోంది. కుటుంబ వివాదం నేపథ్యంలో ఈ ఆస్తుల లెక్కలు ఏవైనా.. విజయ్ రాజకీయ భవిష్యత్తుపై ఈ వ్యక్తిగత పరిణామాలు ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

## జేమ్స్ బాండ్ 007 సీన్ AI క్రియేషన్ – ఆర్జీవీ!



సినిమా రంగంలో సాంకేతిక విప్లవాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక వీడియో నెటిజన్లను విస్మయానికి గురిచేస్తోంది. జేమ్స్ బాండ్ సిరీస్‌లో ఎన్నడూ చూడని ఒక అద్భుతమైన ఛేజ్ సన్నివేశాన్ని ఆయన తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ దృశ్యం ఇప్పటివరకూ వచ్చిన ఏ బాండ్ 007 సినిమాలోనూ లేదు.. అసలు దీనిని కెమెరాతో చిత్రీకరించనే లేదు. ఇది కేవలం కృత్రిమ మేధస్సు (ఏఐ) సృష్టించిన ఒక ఊహాజనిత దృశ్యం. సినిమా భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చెప్పడానికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే అని ఆర్జీవీ ఈ వీడియో ద్వారా విశ్లేషించారు. బాండ్ సీన్ పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ద్వారా సాధ్యమా అని ఇది చూసిన వారు ఆశ్చర్యపోతున్నారు. ఇది ఏ బాండ్ సినిమాలోనూ లేని –నాన్–ఎగ్జిస్టెంట్– సన్నివేశం. ఆధునిక ఏఐ వీడియో జనరేషన్ టూల్స్ అయిన సోరా, క్లింగ్ లేదా రన్‌వే జెన్–3 వంటి టెక్నాలజీలను ఉపయోగించి దీనిని సృష్టించారు. కేవలం కొన్ని టెక్ట్స్ ప్రాంప్ట్స్ ఇవ్వడం ద్వారా AI ఇలాంటి అత్యున్నత నాణ్యత గల విజువల్స్‌ను సులభంగా రూపొందించగలదని ఈ వీడియో నిరూపించింది. అసలైన షూటింగ్ లేకుండానే ఒక బ్లాక్ బస్టర్ మూవీ రేంజ్ యాక్షన్ సీన్‌ను మనం కళ్లముందు చూడటం టెక్నాలజీ మాయాజాలంగా పరిగణించాలి. ఏఐ తన దగ్గర ఉన్న వేల గంటల జేమ్స్ బాండ్ సినిమాల డేటాను క్షుణ్ణంగా విశ్లేషించి అందించి ఉండొచ్చని టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బాండ్ సినిమాల్లో ఉండే ప్రత్యేకమైన కలర్ గ్రేడింగ్, కెమెరా యాంగిల్స్, జేమ్స్ బాండ్ పాత్ర బాడీ లాంగ్వేజ్, లైటింగ్‌ను ఇది రీక్రియేట్ చేసింది. ఒక సాధారణ ప్రేక్షకుడికి ఇది నిజమైన సినిమా సీన్ కాదని గుర్తించడం అసాధ్యం. సాంకేతికంగా చూస్తే...ఏఐ ప్రస్తుతం ఒకేసారి నిమిషాల కొద్దీ వీడియోను సృష్టించలేదు. ఈ వీడియో కూడా 5 నుండి 10 సెకన్ల నిడివి గల అనేక చిన్న చిన్న క్లిప్‌లను ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లో కలిపి.. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ యాడ్ చేయడం ద్వారా ఒక అద్భుతమైన ఛేజ్ సీన్‌గా రూపాంతరం చెందింది., ప్రొడ్యూసర్ రామ్ గోపాల్ వర్మ ఎప్పుడూ కొత్త టెక్నాలజీని ఆహ్వానించడంలో ముందుంటారు. భవిష్యత్తులో కెమెరాలు, భారీ లైటింగ్ సెటప్పులు, వందల మంది సిబ్బంది అవసరం లేకుండా.. కేవలం ఒక కంప్యూటర్ ముందు కూర్చుని విజువల్ వండర్స్ సృష్టించవచ్చని చెప్పడమే ఆయన ప్రధాన ఉద్దేశ్యం. సినిమా నిర్మాణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు.. సృజనాత్మకతకు హద్దులు లేకుండా చేయడంలో ఏఐ (కృత్రిమ మేధ) కీలక పాత్ర పోషిస్తుందని ఆర్జీవీ అభిప్రాయపడుతున్నారు. సాంకేతికత అందుబాటులోకి వస్తున్న కొద్దీ సినిమా మేకింగ్ అనేది కేవలం ధనవంతులకు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికీ సులభతరం కాబోతోంది.

## అందాలతో బ్లాస్ట్ చేస్తున్న మౌని రాయ్..



అద్భుతమైన నటనతోనే కాదు మైమరిపించే అందాలతో ఆకట్టుకుంటున్న అది కొద్ది మంది హీరోయిన్స్ లో మౌని రాయ్ కూడా ఒకరు. హిందీ టెలివిజన్ సీరియల్స్ లో నటిస్తూ భారీ పాపులారిటీ సంపాదించుకున్న ఈమె.. నాగిన్ సీరియల్ తో మరింత క్రేజ్ సొంతం చేసుకుంది. ఇదే సీరియల్ తెలుగులో నాగిని అంటూ విడుదల చేయగా.. ఇటు తెలుగు బుల్లితెర ఆడియన్స్ ని కూడా ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఒకవైపు సీరియల్స్ లోనే కాకుండా మరొకవైపు సినిమాలలో కూడా నటిస్తూ బిజీగా మారింది. 2006లో 'క్యూంకీ సాస్ భీ కభీ బహు థీ' అనే టెలివిజన్ షో తో నటన జీవితాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత పలు సీరియల్స్ లో నటించిన ఈమె ' హీరో హిట్లర్ ఇన్ లవ్' అనే పంజాబీ చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసింది. 2018లో వచ్చిన గోల్డ్ చిత్రంతో హిందీ సినీ రంగంలోకి అడుగు పెట్టింది. ఇందులో ఉత్తమ నటన కనబరిచినందుకు గానూ ఉత్తమ మహిళ అరంగేట్రం కోసం ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ కూడా చేయబడింది మౌని రాయ్. అలాగే 2022లో బ్రహ్మాస్త్ర పార్ట్ 1 లో నటించి విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది.. ఇకపోతే ఈ చిత్రం ఉత్తమ సహాయక ఫిలింఫేర్ అవార్డుకు నామినేషన్ కూడా అందుకుంది. మౌని రాయ్ వ్యక్తిగత జీవిత విషయానికి వస్తే.. తరచూ దుబాయ్ వెళుతున్న నేపథ్యంలో యూఏఈ ఈమెకు గోల్డెన్ వీసా అందించింది. మూడు సంవత్సరాల రిలేషన్ తర్వాత గోవాలోని పనాజీలో దుబాయ్ కి చెందిన మలయాళీ వ్యాపారవేత్త సూరజ్ నంబియార్ తో 2022 జనవరి 27న ఏడడుగులు వేసింది. బెంగాలీ సాంప్రదాయం ప్రకారం ఒకసారి మలయాళీ సంప్రదాయం ప్రకారం మరోసారి అలా రెండుసార్లు వివాహం చేసుకుంది మౌని రాయ్. మౌని రాయ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం విశ్వంభర సినిమాలో నటించింది. ఈ సినిమా ఈ ఏడాది విడుదల కాబోతున్నట్లు ఇటీవల మెగాస్టార్ చిరంజీవి కూడా అధికారిక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అలాగే హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటిస్తోంది. అంతేకాదు మరో హిందీ చిత్రంలో కూడా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుంది.

## టీమ్ఇండియా విజయంలో అతడు కీలక పాత్ర పోషించాడు



టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ (97ఐ) బ్యాట్‌తో రాణించాడు. టీమ్ఇండియా ఈ మ్యాచ్‌లో విజయం సాధించి, సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు.

'మేం ఆడిన విధానంతో మాకు చాలా ఆనందంగా ఉంది. చావోరేవో తేల్చుకోవాల్సిన క్వార్టర్ ఫైనల్ లాంటి మ్యాచ్‌లో టీమ్ఇండియా క్రికెటర్లు అద్భుతంగా ఆడారు. ఓపికగా ఎదురుచూసిన మంచి మనుషులకు మంచే జరుగుతుంది. ఇదంతా అతడి (సంజు శాంసన్) హార్డ్ వర్క్ వల్లే సాధ్యమైంది. అతడు ఆడిన విధానం జట్టుకు విజయాన్ని అందించింది' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు.

అలాగే బౌలర్ల గురించి కూడా అతడు మాట్లాడాడు. 'మా బౌలర్లు ప్రణాళిక ప్రకారమే బంతులు సంధించారు. అలాగే బ్యాటర్లు కూడా బాగా ఆడారు. భాగస్వామ్యాలే కీలకమయ్యాయి. క్రికెట్‌లో ఒత్తిడి సాధారణం. కానీ అలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యంగా బ్యాటర్లు పరుగులు తీయాలి. ఒత్తిడి లేకుండా ఆనందం లేదు' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు.

సంజుశాంసన్ వరల్డ్ క్లాస్ ప్లేయర్: గౌతమ్ గంభీర్

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో సంజుశాంసన్ విఫలమైన విషయం తెలిసిందే. దీంతో టీ20 వరల్డ్‌కప్ 2026లో తుది జట్టులో స్థానం కోల్పోయాడు. కేవలం ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే ఆడే అవకాశం వచ్చింది. అయితే వాటిలోనూ పెద్దగా స్కోర్లు చేయలేదు. కానీ వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ అతడిని వరల్డ్ క్లాస్ ఆటగాడని అభినందించాడు. 'సంజు శాంసన్ ఓ వరల్డ్ క్లాస్ ప్లేయర్. అతడు ఎంత మంచి క్రికెటరో మనందరికీ తెలుసు. అందుకే మేం అతడికి మద్దతుగా నిలిచాం. జట్టుకు అవసరమైన సమయంలో తన సత్తా చాటాడు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో తన సామర్థ్యాన్ని చూపించాడు. మిగిలిన మరో రెండు మ్యాచుల్లోనూ అతడు ఇలాగే రాణించాలని కోరుకుంటున్నా. సంజు శాంసన్‌తో పాటు ఇషాన్ కిషన్.. వీరిద్దరూ ప్రస్తుతం టీమ్ఇండియాకు కీలకమైన ఆటగాళ్లు. భవిష్యత్తులోనూ వీరు ఇలాగే పరుగులు రాబట్టాలి' అని గంభీర్ పేర్కొన్నాడు.

## మూడు ఇన్నింగ్స్‌లూ సూపర్



ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్ఇండియా 2011 వన్డే ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆస్ట్రేలియాతో టీమ్ఇండియా తలపడింది. ఐసీసీ టోర్నీలంటే చెలరేగిపోవడం ఆసీస్‌కు అలవాటు. కానీ, యువరాజ్ సింగ్ ముందు మాత్రం ఆ జట్టు పప్పులు ఉడకలేదు. 261 పరుగుల లక్ష్య ఛేదనలో సచిన్ (53), గంభీర్ (50) హాఫ్ సెంచరీల దెబ్బకు అలవోకగా విజయం సాధిస్తుందని అంతా భావించారు. అనూహ్యంగా స్వల్ప వ్యవధిలో వికెట్లు చేజార్చుకొని ఇబ్బందుల్లో పడిన టీమ్ఇండియాను సురేశ్ రైనా (34ఐ)తో కలిసి యువరాజ్ (57ఐ) ఆదుకొన్నాడు. చివరివరకూ క్రీజ్‌లో ఉండి జట్టును గెలిపించాడు. బ్రెట్ లీ, షాన్ టైట్, మిచెల్ జాన్సన్ వంటి పేసర్లను తట్టుకొని పరుగులు రాబట్టిన యువీ.. మ్యాచ్ ముగిసిన తర్వాత సింహనాదమే చేశాడు. తొలుత బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బకొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఈసారి కింగ్ కోహ్లీ..

ఛేజింగ్ కింగ్ అని విరాట్‌ను ఊరికనే అనరు. లక్ష్యం ఎంతైనా సరే.. అతడు బరిలోకి దిగాడంటే హాంఫట్ అయిపోవాల్సిందే. ఇప్పుడు విండీస్‌పై సంజు ఘనత సాధించాడు కానీ.. టీ20 ప్రపంచకప్‌ల్లో లక్ష్య ఛేదనకు దిగినప్పుడు అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా మొన్నటివరకూ విరాట్ కోహ్లీనే ఉన్నాడు. 2016లో ఆస్ట్రేలియా, 2021లో పాక్‌పై 82 పరుగులు చొప్పున చేసి అజేయంగా నిలిచాడు. 2016లోనూ భారత్ సెమీస్‌కు చేరుకోవాలంటే ఆసీస్ అనే అడ్డంకిని అధిగమించాల్సిన పరిస్థితి. అదికూడా ఈసారి ఆడినట్టే 'క్వార్టర్ ఫైనల్' లాంటిదే. 161 పరుగుల లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ (82: 51 బంతుల్లో) అదరహో అనిపించాడు. ఏడు బంతుల్లో 4 పరుగులు కొట్టాల్సిన సమయంలో ధోనీ స్ట్రైకింగ్‌లో ఉన్నాడు. కానీ, సింగిల్ తీసే అవకాశం వచ్చినా వద్దని కోహ్లీని ధోనీ వారించాడు. విన్నింగ్ షాట్‌గా బౌండరీ కొట్టి విరాట్ కోహ్లీ సంతోషంతో మైదానంలో అలా ఉండిపోయాడు.

ఇప్పుడు సంజు..

ఓడితే ఇంటిముఖం పట్టాల్సిందే. అవతలి వైపు దూకుడుగా ఆడే విండీస్. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌పై భారత బౌలర్ల దెబ్బకు వెస్టిండీస్ 200లోపే పరుగులు చేయగలిగింది. అయితే, ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌లో లేడు. వన్‌డౌన్ వచ్చిన ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌లో నిలకడలేదు. సూర్యకుమార్ కూడా త్వరగా పెవిలియన్‌కు చేరాడు. తిలక్ వర్మ కొన్ని మెరుపులు మెరిపించాడు. పాండ్య దూకుడు కొద్దిసేపే ఉంది. ఓ ఎండ్‌లో మాత్రం పాతుకుపోయిన ఓపెనర్ సంజు శాంసన్ (97ఐ: 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) చివరివరకూ ఉండి జట్టును గెలిపించాడు.

## భారత్‌లో చిక్కుకుపోయిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు



వెస్టిండీస్ క్రికెట్ జట్టు టీ20 వరల్డ్‌కప్ 2026 నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే. అయితే వారు భారత్‌ను కాస్త ఆలస్యంగా వీడనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల కారణంగా అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో అంతరాయమే దీనికి కారణం. ఆటగాళ్ల ప్రయాణ భద్రత కోసం తాము ఐసీసీ (×జజ), సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్నామని వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ ప్రకటించింది. గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇరాన్ ప్రతిదాడి వల్ల దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. 'గల్ఫ్ ప్రాంతంలో సైనిక చర్య వల్ల ప్రయాణ ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీంతో అనేక అంతర్జాతీయ విమాన మార్గాలు ప్రభావితమయ్యాయి. భద్రత కారణాల దృష్ట్యా విమాన సంస్థలు ముందుగా షెడ్యూలు చేసిన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది' అని వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ ఓ ప్రకటనలో తెలిపింది. వెస్టిండీస్‌తో పాటు, జింబాబ్వే జట్టు కూడా ఈ కారణంగానే భారత్‌లో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జింబాబ్వే క్రికెట్ జట్టు దిల్లీలో ఉన్నట్లు తెలుస్తోంది. 'మా క్రికెట్ జట్టు దుబాయ్ ద్వారా స్వదేశానికి తిరిగి రావాల్సిఉంది. కానీ మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి కారణంగా ప్రయాణ ప్రణాళికలు ప్రభావితమయ్యాయి' అని జింబాబ్వే క్రికెట్ బోర్డ్ ఎక్స్ వేదికగా ఓ ప్రకటనలో తెలిపింది.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com